RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 | సంచిక : 322 | మంగళవారం 24 - 06 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

## నిన్న సాయంత్రంలోగా

# ‘చంపేస్తాం’



- ఎంపీ రఘునందన్‌కు బెదిరింపు కాల్
- బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుని చంపేస్తామని పీపుల్స్ వార్ మావోయిస్టుల పేరుతో ఫోన్ చేసి బెదిరింపు
- 912143352974 నంబర్ నుంచి ఫోన్ కాల్
- తాను మధ్యప్రదేశ్‌కి చెందిన మావోయిస్టునని ఓ ఆగంతకుడు ఫోన్

చంపేస్తామంటూ మావోయిస్టు పేరుతో వచ్చిన బెదిరింపు కాల్‌కు భయపడేది లేదని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కూడా ఇలాంటి బెదిరింపు కాల్స్ కు ఆందోళనకు గురికాబోమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తనను చంపేస్తామంటూ మధ్యప్రదేశ్ మావోయిస్టుల పేరుతో వచ్చిన ఫోన్ కాల్ నేపథ్యంలో ఆయన తాజాగా ఓ వీడియోను రిలీజ్ చేశారు. మధ్యప్రదేశ్ పీపుల్స్ వార్ మావోయిస్టు పేరుతో ఇవాళ బెదిరింపు కాల్ వచ్చిందని రఘునందన్ రావు అన్నారు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడెంలోని ఓ పాఠశాల - మిగతా 2 లో

## బనకచర్ల, స్థానిక సంస్థల ఎన్నికలపైనే ప్రధాన చర్చ



## కేబినెట్ భేటీ

- మొదటి సారిగా పాల్గొన్న మంత్రులు వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్
- ప్రధానాంశాలుగా బనకచర్ల ప్రాజెక్టు, స్థానిక సంస్థల ఎన్నికలు
- ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టును తెలంగాణ పూర్తిగా వ్యతిరేకిస్తోంది

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం తెలంగాణ సచివాలయంలో 2 గంటలుగా కొనసాగుతోంది. ఇటీవలే ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులు వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ మొదటి సారిగా ఈ భేటీకి హాజరయ్యారు. గోదావరి - బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకెళ్లకుండా ఎలాంటి స్టాండ్ తీసుకోవాలనే అంశంపై కీలక చర్చ జరగుతోంది. తదుపరి స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా మంత్రిమండలి చర్చించే అవకాశం ఉంది. రాజీవ్ యువ వికాసం పథకం, కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ రిపోర్టు, సంక్షేమ పథకాలకు సమర్థవంతంగా కొనసాగించడానకి నిధుల సమీకరణ వంటి అంశాలపై కూడా చర్చ జరిపే అవకాశం ఉంది.బనకచర్ల ప్రాజెక్టుపైనే - మిగతా 2 లో

## ఓ మనిషి చనిపోతే సమర్థించుకుంటారా?




- జగన్ ట్వీట్ కు హెూంమంత్రి అనిత కౌంటర్
- పల్నాడు ఘటనపై జగన్ ట్వీట్‌ను ఖండించిన హెూంమంత్రి అనిత
- జగన్ వ్యాఖ్యలు హింసను ప్రోత్సహించేలా ఉన్నాయని ఆరోపణ
- సొంత కార్యకర్త మృతిచెందినా జగన్ పట్టించుకోలేదని విమర్శ
- జగన్‌కు జెడ్ ప్లస్ భద్రత కొనసాగుతోందని స్పష్టం చేసిన మంత్రి
- వైసీపీ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపాటు
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి

2లో

## రాజ్యసభకు వెళ్లడం లేదని స్పష్టత




- రాజ్యసభకు వెళ్లడంపై క్లారిటీ ఇచ్చిన ఆప్ అధినేత కేజ్రీవాల్
- ఉపఎన్నికల విజయాలను 2027 ఎన్నికలకు సెమీఫైనల్‌గా అభివర్ణించిన కేజ్రీవాల్
- “మేం 2022లో గెలిచిన దానికంటే దాదాపు రెట్టింపు తేడాతో ఇప్పుడు గెలిచాం
- 2027లో ఆప్ తుఫాను వస్తుందని అంటున్నారు
- మాకు భారీ మెజారిటీ విజయం ఇవ్వడం ద్వారా, పంజాబ్ ప్రజలు రాష్ట్రంలో ఆప్ పనికి తమ ఆమోద ముద్ర వేశారు”

గుజరాత్, పంజాబ్ ఉపఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పనితీరును జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రశంసించారు. ఉపఎన్నికల్లో విజయాలు 2027లో జరగనున్న రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్?గా అభివర్ణించారు. ఓటర్లు బీజేపీ, కాంగ్రెస్ రెండింటినీ - మిగతా 2 లో

## సింగయ్య మృతి వ్యవహారంపై తొలిసారిగా స్పందించిన జగన్




- చంద్రబాబు రాజకీయాలను దిగజార్చారంటూ జగన్ ఫైర్
- నా పర్యటనకు ఆంక్షలెందుకు? అంటూ నిలదీత
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లింపుకే కుట్రలు అంటూ ఆరోపణ
- మరణించిన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచామని వెల్లడి
- మీ పర్యటనల్లో మరణిస్తే మీరేం చేశారు? అంటూ చంద్రబాబుకు సూటి ప్రశ్న

పల్నాడు జిల్లా పర్యటనలో సింగయ్య అనే వ్యక్తి మృతి తీవ్ర వివాదాస్పదం అయిన నేపథ్యంలో వైసీపీ అధినేత జగన్ సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు తన తీరుతో రాజకీయాలను మరింత దిగజార్చారని ఆరోపిస్తూ, పలు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తన పర్యటనలపై ఆంక్షలు ఎందుకు విధిస్తున్నారని, కార్యకర్తలు తనను కలవకుండా ఎందుకు

## యుద్ధం మీరు మొదలు పెట్టొచ్చు

# ముగించేది మేమే

- ట్రంప్‌కు ఇరాన్ హెచ్చరిక
- అమెరికాపై ప్రతీకార దాడులకు దిగుతామని ఇరాన్ సైన్యం తీవ్ర హెచ్చరిక
- అణు స్థావరాలపై దాడులతో తమ లక్ష్యాల పరిధి విస్తరించిందని ప్రకటన
- ఇజ్రాయెల్ బాంబు దాడి ఒక పెద్ద తప్పిదమని ఇరాన్ సుప్రీం లీడర్ ఖొమేనీ వ్యాఖ్య



అమెరికా... ఇరాన్ అణు స్థావరాలపై దాడులు చేయడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అమెరికా తమపై నేరుగా దాడులకు పాల్పడినందున ప్రతీకార చర్యలు తప్పవని ఇరాన్ సైన్యం సోమవారం హెచ్చరించింది. ఇరాన్ మిలిటరీ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి ఇబ్రహీం జుల్ఫఘారీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.“ఓ జూదగాడివైన ట్రంప్, ఈ యుద్ధాన్ని నువ్వు ప్రారంభించవచ్చు, కానీ ముగించేది మాత్రం మేమే” అని ఆయన హెచ్చరించారు.ఈ సంఘర్షణలో అమెరికా ప్రత్యక్షంగా - మిగతా 2 లో

## ఆర్.కృష్ణయ్యకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన



- కవితతో వేదిక పంచుకున్న ఆర్.కృష్ణయ్యకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన
- బీసీ బిల్లుకు రాజకీయ రంగు పులమొద్దన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- పదేళ్ల పాలనలో బీసీలను పట్టించుకోని కవితకు ఇప్పుడు ప్రేమ ఎందుకని ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసి గవర్నర్‌కు పంపిందని వెల్లడి
- కవితతో వేదిక పంచుకోవద్దని కృష్ణయ్యకు సూచన
- కేంద్ర బీసీ బిల్లు ఆమోదానికి ప్రధాని అపాయింట్‌మెంట్ కోరదామని కృష్ణయ్యకు ప్రతిపాదన

బీసీ బిల్లు అంశానికి రాజకీయ రంగు పులుముతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు బీసీల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోని కవిత, ఇప్పుడు వారి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని - మిగతా 2 లో

## చదువుకున్న వారు రాజకీయాల్లోకి రావాలి

- డీవీఆర్ సైనిక్ స్కూలు ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్
- బాపట్ల జిల్లా ఇంకొల్లులో డాక్టర్ డీవీఆర్ సైనిక్ స్కూల్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్
- చదువుకున్న వారు రాజకీయాల్లోకి వచ్చి దేశానికి సేవ చేయాలని పిలుపు
- తల్లిదండ్రులను, గురువులను దైవంగా భావించాలని విద్యార్థులకు సూచన
- దేశ రక్షణలో సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడిన మంత్రి
- దగ్గుబాటి కుటుంబం మూడు తరాలుగా విద్యాసేవలు అందించడం అభినందనీయమన్న లోకేశ్
- నాణ్యమైన విద్యతోనే సమాజంలో మార్పు, పేదరికం నిర్మూలన సాధ్యమని స్పష్టీకరణ




బాగా చదువుకున్న యువత రాజకీయాల్లోకి చురుగ్గా ప్రవేశించి దేశానికి సేవ చేయాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు, గంగవరం రోడ్డులో మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ డీవీఆర్ సైనిక్ స్కూల్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను, గురువులు, తల్లిదండ్రులు, సైనికుల పట్ల గౌరవాన్ని నొక్కి చెప్పారు.ముందుగా సైనిక్ స్కూల్ ప్రధాన భవనం, - మిగతా 2 లో

## సుపరిపాలనలో

# ‘తొలి అడుగు’

- జ్యోతి ప్రజ్వలన చేసిన చంద్రబాబు, పవన్, లోకేశ్, పురందేశ్వరి
- ఏపీలో కూటమి పాలనకు ఏడాది పూర్తి
- అమరావతిలో ప్రత్యేక సదస్సు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కార్యక్రమం
- గత వైసీపీ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్న పవన్
- అరాచకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆర్థిక వ్యవస్థను చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్న పవన్
- ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి



రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఏపీలో కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా, ‘సుపరిపాలనలో తొలి అడుగు’ పేరిట అమరావతిలో నేడు ప్రత్యేక సదస్సును నిర్వహించారు. రాజధాని అమరావతిలోని సచివాలయం వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక ఈ కార్యక్రమానికి వేదికైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సదస్సు ద్వారా గత ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు, భవిష్యత్తు కార్యాచరణ, రెండో ఏడాది లక్ష్యాలపై - మిగతా 2 లో

## మొదటిపేజీ తరువాయి

# యుద్ధం మీరు మొదలు పెట్టొచ్చు ముగించేది మేమే

పాల్గొనడం వల్ల ఇరాన్ సాయుధ బలగాల చట్టబద్ధమైన లక్ష్యాల పరిధి పెరిగిందని స్పష్టం చేశారు. ఇటీవల అమెరికా, ఇరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై వైమానిక దాడులు జరిపిన విషయం తెలిసిందే. ఫోర్డోలోని భూగర్భ యురేనియం శుద్ధి కేంద్రంతో పాటు ఇస్ఫహాన్, నతాంజ్‌లలోని అణు కేంద్రాలపై ఈ దాడులు జరిగాయి. ఈ దాడులతో టెహ్రాన్ అణు సామర్థ్యాలను పూర్తిగా నిర్మూలించామని ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ హెచ్చరికలు వెలువడ్డాయి. ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖొమేనీ కూడా స్పందిస్తూ, జూన్ 13న ఇజ్రాయెల్ ప్రారంభించిన బాంబు దాడుల పరంపరను ఒక పెద్ద తప్పిదంగా అభివర్ణించారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో, వివాదం మరింత విస్తృతమైన ప్రాంతీయ యుద్ధంగా మారవచ్చనే ఆందోళనలతో సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో చమురు ధరలు నాలుగు శాతానికి పైగా పెరిగాయి. ప్రపంచ చమురు ఉత్పత్తిలో ఐదో వంతు రవాణా అయ్యే కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయకుండా నిరోధించడానికి చైనా సహాయం చేయాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కోరారు.

# ఆర్.కృష్ణయ్యకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన

ఆయన ఎద్దేవా చేశారు. సోమవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం బీసీ బిల్లును శాసనసభలో ఆమోదింపజేసి, గవర్నర్ ఆమోదం కోసం పంపిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తక్కువ చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ఇదే సందర్భంలో, బీసీ రిజర్వేషన్ల కోసం కవిత చేపట్టిన ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరిన ఎంపీ ఆర్. కృష్ణయ్య వైఖరిపైనా మంత్రి స్పందించారు. "బలహీన వర్గాల కోసం విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేసిన పెద్దన్న ఆర్. కృష్ణయ్య అంటే మా అందరికీ ఎంతో గౌరవం ఉంది. అయితే, పదేళ్లు అధికారంలో ఉండి బీసీలకు ఎలాంటి మేలు చేయని కవిత వంటి వారితో వేదిక పంచుకుని మీ గౌరవాన్ని తగ్గించుకోవద్దు" అని కృష్ణయ్యకు హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీ బిల్లును పంపామని, దాని ఆమోదం కోసం ఆర్. కృష్ణయ్య చొరవ తీసుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. అవసరమైతే అందరం కలిసి ప్రధానిని కలుద్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదించారు.

విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ పాలనలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా రూపొందించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాఖాధిపతులు (హెచ్వోడీలు), అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. అంతేకాకుండా, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు కూడా ఈ సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని విశ్లేషిస్తూనే, రాబోయే సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సమావేశం ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం పెంచడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

# 'సుపరిపాలనలో తొలి అడుగు'

కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా ఏడాది పాలన పూర్తి చేసుకుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్ర శ్రేయస్సే తన ప్రథమ ప్రాధాన్యమని, 2019లో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం విధ్వంసకర పాలన సాగించిందని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన 'సుపరిపాలనలో తొలి అడుగు' అనే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు అనేక కష్టనష్టాలకు గురయ్యారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో అధికారులు కూడా భయంతో విధులు నిర్వర్తించాల్సి వచ్చిందని, చివరికి నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబుని సైతం పలు రకాలుగా వేధించారని ఆయన గుర్తుచేశారు. "వైసీపీ పాలన చూసిన తర్వాత, ఆంధ్రప్రదేశ్‌కు అసలు భవిష్యత్తు ఉంటుందా అనే సందేహం కలిగింది. ఒకవేళ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకపోయి ఉంటే రాష్ట్ర పరిస్థితి ఏమై ఉండేదో ఊహించడానికే భయంగా ఉంది. మాతో పాటు మా కుటుంబ సభ్యులను కూడా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు" అని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే ఏకైక లక్ష్యంతో తామందరం కూటమిగా ఏర్పడి ముందుకు వచ్చామని ఆయన స్పష్టం చేశారు. తమ పోరాటాన్ని ప్రజలు గుర్తించి, ఎన్నికల్లో అఖండ మెజారిటీతో ఆశీర్వదించారని తెలిపారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పకూలిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని పవన్ కొనియాడారు. "ఈ ఏడాది కాలంలోనే రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించగలిగాం. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించింది. మేము గ్రామపంచాయతీలకు కేటాయించే నిధులను గణనీయంగా పెంచాం. 'పల్లెపండగ' కార్యక్రమం ద్వారా గ్రామీణ రహదారుల అభివృద్ధికి బాటలు వేశాం" అని ఆయన వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు సాగించిన అరాచకాలను, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఇంకా కొనసాగిస్తున్నారని పవన్ మండిపడ్డారు. "గొంతులు కోస్తామంటూ బెదిరింపులకు పాల్పడితే, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదు. వైసీపీకి కనీసం ప్రతిపక్షానికి అవసరమైన సంఖ్యా బలం కూడా లేదు. అయినా వారి వైఖరిలో ఎలాంటి మార్పు రావడం లేదు" అని ఆయన విమర్శించారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. "మేము చట్టానికి లోబడి వ్యవహరించాలి కాబట్టి సంయమనంతో ఉంటున్నాం. ఎన్నో అవమానాలు, దెబ్బలు తిని ఈ స్థాయికి చేరుకున్నాం. ఎవరైనా పిచ్చివేషాలు వేసి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలని చూస్తే ఉపేక్షించేది లేదు. అలాంటి వారిని తొక్కి నారతీస్తాం" అని పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు.

# 'నిన్ను సాయంత్రంలోగా చంపేస్తాం'

కార్యక్రమంలో ఉండగా 912143352974 నంబర్ నుంచి తనకు ఫోన్ చేసి ఇప్పుడే మధ్యప్రదేశ్ నుంచి మావోయిస్టు పార్టీ దళం బయలుదేరింది. ఇవాళ అర్ధరాత్రి లోపు మెదక్ ఎంపీ రఘునందన్ రావును చంపేస్తామని హెచ్చరించారని చెప్పారు. ఈరోజు అర్ధరాత్రి వరకే డెడ్ లైన్ అని జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తూ రెండోసారి కూడా ఫోన్ చేశారన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపేందుకు మావోయిస్టు పార్టీ ఏదైనా సెన్సేషన్ కోసం ప్రయత్నిస్తోందా? తెలియడం లేదన్నారు. ఈ క్రమంలో ఎవరిని బలితీసుకోబోతున్నారో అనేది తాము ఆందోళన చెందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రఘునందన్ రావు అప్రమత్తమై తెలంగాణ డీజీపీ జితేందర్‌కి, సంగారెడ్డి ఎస్పీకి, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రఘునందన్ రావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాల్ నెంబర్ ఆధారంగా విచారణ చేస్తున్నారు. ఎక్కడ నుంచి ఈ కాల్ వచ్చిందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై బీజేపీ అగ్రనేతలు ఎంపీ రఘునందన్‌రావుకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

# బనకచర్ల ప్రాజెక్టు, స్థానిక సంస్థల ఎన్నికలపైనే ప్రధాన చర్చ



ప్రధానంగా చర్చ : బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై ప్రధానంగా సుదీర్ఘంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టును తెలంగాణ పూర్తిగా వ్యతిరేకిస్తోంది. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు నష్టం జరుగుతుందని తీవ్రమైన అభ్యంతరాలను వ్యక్తం చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా దిల్లీకి వెళ్లి కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కలిసి పూర్తి వివరాలను తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు : ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలు ఏ వ్యూహం ప్రకారం నిర్వహించాలి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను ఎలా కల్పించాలని చర్చించే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్ల వివాదం న్యాయస్థానంలో ఉన్నందున అది తేలే వరకు వేచి చూడాలా? పాత రిజర్వేషన్ల ప్రకారమే ఈ దఫాకు ముందుకెళ్లాలా? అనే అంశం చర్చకు రానుంది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై మరింత విస్తృత ప్రచారం ఎలా కల్పించాలి? తదితర అంశాలపై మంత్రి వర్గ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

# చదువుకున్న వారు రాజకీయాల్లోకి రావాలి

మొదటిపేజీ తరువాయి

కంప్యూటర్‌ల్యాబ్, సైన్స్ ల్యాబ్, బాలుర, బాలికల వసతి గృహాలు, క్యాంటీన్, మెస్ భవనాలను డీవీఆర్ సైనిక్ స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ హితేష్ చెంచురామ్‌తో కలిసి మంత్రి లోకేశ్ ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దగ్గుబాటి చెంచురామయ్య, దగ్గుబాటి నీలమోహన్ విగ్రహాలను ఆవిష్కరించారు.

**గురువులు దైవసమానులు, తల్లుల త్యాగాలు మరువలేనివి**

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి లోకేశ్ ప్రసంగిస్తూ, "గురుబ్రహ్మ, గురువిష్ణు, గురుదేవో మహేశ్వరః అంటారు. మన జీవితంలో పుట్టినప్పటి నుంచి చివరి వరకు గురువులు కీలక పాత్ర పోషిస్తారు. నేను పదో తరగతి వరకు భారతీయ విద్యాభవన్‌లో, ఇంటర్ లిటిల్ ఫ్లవర్‌లో చదివాను. ఆనాటి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్ రాజ్ రెడ్డి గారు వంటి ఎంతో మంది గురువులు ఇప్పటికీ నాకు సలహాలు, సూచనలు ఇస్తుంటారు. అందుకే గురువులను దేవుడితో సమానంగా గౌరవించాలి" అని తెలిపారు. తల్లుల గొప్పతనాన్ని వివరిస్తూ, "మనల్ని షరతులు లేకుండా ప్రేమించేది అమ్మ మాత్రమే. సుందర్ పిచాయ్ తల్లి ఆయన కోసం ఎన్నో త్యాగాలు చేశారని దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారు చెప్పారు. అది విని నేను ఆశ్చర్యపోయాను. తల్లుల త్యాగాల వల్లే మనం చదువుకోగలుగుతున్నాం, ఈ స్థాయికి చేరుకుంటున్నాం. అందుకే ప్రతి ఒక్కరూ తల్లులను గౌరవించాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు తప్పనిసరిగా తల్లి ఆశీర్వాదం తీసుకోవాలి" అని విద్యార్థులకు హితవు పలికారు.

**విద్యతోనే పేదరికం దూరం – దగ్గుబాటి కుటుంబ సేవలు ప్రశంసనీయం**

మారుమూల ప్రాంతంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయడంపై లోకేశ్ ఆనందం వ్యక్తం చేశారు. "పేదరికం నుంచి బయటపడాలంటే అద్భుతమైన విద్యను అందించాలి. విద్యతోనే జీవితాల్లో మార్పు వస్తుంది. ఈ విషయాన్ని దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారి తండ్రి, దూరదృష్టి కలిగిన దగ్గుబాటి చెంచురామయ్య గారు 1980లలోనే గ్రహించి ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలు స్థాపించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారు" అని కొనియాడారు. "ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ పెదనాన్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పెద్దమ్మ దగ్గుబాటి పురందేశ్వరి, వారి పిల్లలు హితేష్, నివేదిత అద్భుతమైన విద్యాసంస్థలు నెలకొల్పారు. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కుటుంబం పనిచేయడం, ఈ ఏడాది సైనిక్ స్కూల్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది" అని అభినందించారు. "పెదనాన్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారు అధికారంలో ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజల కోసం పనిచేయాలనే దృక్పథంతో ఈ సైనిక్ స్కూల్‌ను నెలకొల్పారు. గతంలో ఎంపీగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా ప్రజలకు ఎనలేని సేవలందించారు. ఇప్పుడు మూడో తరం ప్రతినిధిగా హితేష్ కూడా తాత, తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళుతూ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో పనిచేస్తుండటం ఆనందదాయకం. ఈ పవిత్ర కార్యక్రమానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని మంత్రి హామీ ఇచ్చారు.

**సైనికుల త్యాగాలు మరువలేనివి**

సైనిక్ స్కూల్ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ, "పహల్గాం ఉగ్రదాడి ఘటనను ప్రధాని మోదీ ధీటుగా ఎదుర్కొని శత్రువులకు గుణపాఠం చెప్పారు. మన సైనికులు మన కోసం నిలబడుతున్నారు. జవాన్




మురళీనాయక్ వంటి వీరులు దేశం కోసం ప్రాణాలర్పించారు. ఆయన తల్లిదండ్రులను నేను పరామర్శించాను. తల్లిదండ్రులు వద్దన్నా దేశసేవకే అంకితమయ్యారు. సైనికుల త్యాగాల వల్లే మనం సురక్షితంగా ఉన్నాం. అలాంటి గొప్ప సైనికులను అందించడానికే ఈ సైనిక్ స్కూల్. మన ప్రాంత సైనికులు తిరిగి వచ్చినప్పుడు వారిని జాగ్రత్తగా చూసుకోవాలి, వారికి గౌరవంగా సెల్యూట్ చేయాలి," అని లోకేశ్ ఉద్ఘాటించారు.

**నేను రెండు సవాళ్లు స్వీకరించాను**

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "పరీక్షల్లో విఫలమైతే ఆత్మహత్యలు చేసుకోవద్దు. జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. కష్టమైన మార్గాన్నే ఎంచుకోవాలి. నేను రెండు సవాళ్లు స్వీకరించాను. మొదటిది... 40 ఏళ్లుగా గెలవని మంగళగిరిలో పోటీచేసి తొలిసారి ఓడినా, రెండోసారి కసితో పనిచేసి రాష్ట్రంలో మూడో అత్యధిక మెజారిటీతో గెలిచాను. నన్ను ఎంతో ఎగతాళి చేశారు, అయినా గెలుపే లక్ష్యంగా పనిచేశా. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు" అన్నారు. విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించడం రెండో సవాల్ అని వెల్లడించారు. ప్రభుత్వ విద్య ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని, రాష్ట్ర విద్యావ్యవస్థను దేశం మొత్తం చూసేలా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. విశాఖలో 3 లక్షల మందితో యోగాసనాలు వేయించి గిన్నిస్ రికార్డ్ సాధించామని గుర్తుచేశారు. యువతకు రాష్ట్రంలోనే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, అనేక పెట్టుబడులు తీసుకువస్తున్నామని తెలిపారు. "బాగా చదువుకుని, జీవితంలో స్థిరపడి, దేశంలో మార్పు తీసుకురావడానికి, సేవ చేయడానికి రాజకీయాల్లోకి రావాలి" అని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, డాక్టర్ డీవీఆర్ సైనిక్ స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ హితేష్ చెంచురామ్ తదితరులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎమ్మెల్యే వి.నరేంద్ర వర్మ, చీరాల ఎమ్మెల్యే ఎంఎమ్ కొండయ్య, మాజీ ఎమ్మెల్యే గరటయ్య, బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళీ, బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ తదితరులు పాల్గొన్నారు.

# సింగయ్య మృతి వ్యవహారంపై తొలిసారిగా స్పందించిన జగన్

మొదటిపేజీ తరువాయి

జగన్ ప్రశ్నించారు. "గతంలో మీరు గానీ, మీ మిత్రుడు పవన్ కల్యాణ్ గానీ పర్యటనలు చేసినప్పుడు మేమెప్పుడైనా ఇలాంటి ఆంక్షలు విధించామా?" అని నిలదీశారు. ప్రతిపక్ష నాయకుడిగా పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లడం, రైతులు, ప్రజలకు సంఘీభావం తెలపడం తప్పా అని ప్రశ్నించారు. జడ్ ప్లస్ కేటగిరీ భద్రత అనేది మాజీ ముఖ్యమంత్రులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని తమకు నచ్చినప్పుడు ఉపసంహరించుకునే అధికారం ఏ ప్రభుత్వానికీ ఉండదని జగన్ స్పష్టం చేశారు. "మీకు మూడ్ వచ్చినప్పుడు భద్రత ఇస్తాం, లేనప్పుడు ఉపసంహరించుకుంటాం అనడానికి ఇది మీ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉండదు. ఇది నాకైనా, మీకైనా వర్తించే ప్రోటోకాల్" అని స్పష్టం చేశారు. జడ్ ప్లస్ భద్రత కలిగిన మాజీ ముఖ్యమంత్రి పర్యటన గురించి ముందుగానే సమాచారం ఇచ్చిన తర్వాత, అందుకు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుందని గుర్తుచేశారు. తన పర్యటన సందర్భంగా రూట్ మ్యాప్ ఇచ్చినప్పటికీ, పైలట్ వాహనాలు, రోప్ పార్టీలు వంటి భద్రతా ఏర్పాట్లు ఎందుకు కొరవడ్డాయని జగన్ ప్రశ్నించారు. "జనం ఎక్కువగా ఉన్నప్పుడు, జడ్ ప్లస్ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రి వాహనం చుట్టూ రోప్ పార్టీ ఉండాల్సిన అవసరం లేదా? ఒకవేళ భద్రత కల్పించి ఉంటే, వాహనం కింద మనుషులు ఎలా పడగలుగుతారు? మీరు భద్రత కల్పించలేదన్నది నిజమా, లేక వాహనం కింద ఎవరూ పడలేదన్నది నిజమా?" అని ఆయన నిలదీశారు. జడ్ ప్లస్ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రికి బుల్లెట్ ప్రూఫ్ వాహనం, ప్రభుత్వ డ్రైవర్‌ను కేటాయించడం కూడా



ప్రోటోకాల్‌లో భాగమేనని జగన్ తెలిపారు. "మీరు సరైన బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇవ్వకపోతే, ప్రభుత్వ అనుమతితో నా సొంత డబ్బుతో వాహనం కొనుక్కున్నాను. డ్రైవర్‌ను మీరే ఇచ్చారు. మరి మీ ప్రభుత్వ డ్రైవర్ నడుపుతున్న వాహనానికి, మీరు ఏర్పాటు చేయాల్సిన పైలట్, రోప్ పార్టీల భద్రతా ఏర్పాట్లకు మీదే కదా బాధ్యత?" అని ప్రశ్నించారు. ఈ ఘటనపై ఆరోజు ఎస్పీ ఇచ్చిన స్టేట్‌మెంట్ సంగతి ఏమిటని కూడా జగన్ ప్రస్తావించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఇటువంటి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని జగన్ ఆరోపించారు. "గతంలో మీరు ఇచ్చిన హామీలు, బాండ్లు, మేనిఫెస్టోలోని అబద్ధాలు, మోసాలను నేను ప్రెస్ మీట్ పెట్టి బయటపెట్టాను. మీ పాలనా వైఫల్యాలు, రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో మీరు చేస్తున్న భయంకర పాలన, రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి, ఖజానాకు జరుగుతున్న నష్టం, రైతులు, అక్కచెల్లెమ్మలు, పిల్లల బతుకులు అతలాకుతలం అవుతున్న తీరును ఎత్తిచూపితే, వాటికి సమాధానం చెప్పలేక, ప్రజల్లో మీపై ఉన్న వ్యతిరేకతను, నాపై ఉన్న ప్రేమను చూసి తట్టుకోలేక, మీరు మరింత దిగజారి డైవర్షన్ రాజకీయాలు చేయడం హేయమైన చర్య" అని జగన్ విమర్శించారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకుని మారాలని హితవు పలికారు. సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు జరిగిన దురదృష్టకర ఘటన తన దృష్టికి వచ్చిందని జగన్ తెలిపారు. "వెంటనే మా పార్టీ ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి బాలసాని కిరణ్, మాజీ మంత్రి అంబటి రాంబాబుతో పాటు ఇతర నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారని తెలిసింది. మరుసటి రోజు నేను కూడా ఆ కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించాను. ఒక మనిషిని కోల్పోయిన కుటుంబానికి చేతనైనంత సహాయం చేయడం మా బాధ్యత. మరణించిన వ్యక్తి మమ్మల్ని అభిమానించే వ్యక్తి అయినప్పుడు ఆ బాధ్యత మరింత పెరుగుతుంది. ఇదే పర్యటనలో గుండెపోటుతో మరణించిన మరో అభిమాని విషయంలోనూ ఇలాగే స్పందించాం. అయినా మాపై విషప్రచారం చేస్తున్నారు. మానవత్వం, నైతికత గురించి మీరు పాఠాలు చెప్పడమే ఆశ్చర్యం" అని జగన్ అన్నారు. "చంద్రబాబు గారూ, మీ పర్యటనలు, మీటింగులలో చనిపోయిన వారి విషయంలో మీరేం చేశారు? ఎంత చేశారు? మీరా మానవత్వం, నైతికత గురించి మాట్లాడేది? ఇప్పటికైనా మారండి!" అంటూ జగన్ తన ప్రశ్నలను ముగించారు.

# ఓ మనిషి చనిపోతే సమర్థించుకుంటారా?

మొదటిపేజీ తరువాయి

పల్నాడు జిల్లాలో సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటనకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి చేసిన ట్వీట్‌పై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతల ప్రవర్తన దారుణంగా దిగజారిపోయిందని ఆమె మండిపడ్డారు. సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అనిత మాట్లాడుతూ, జగన్ వ్యాఖ్యలు సమాజంలో హింసను ప్రేరేపించే విధంగా ఉన్నాయని, రాజకీయ నాయకుల మాటలను ప్రజలు నిశితంగా గమనిస్తారని అన్నారు. "సొంత పార్టీ కార్యకర్త వాహనం కింద పడితే పట్టించుకోకపోవడం అత్యంత దారుణమైన విషయం. గాయపడిన వ్యక్తిని కనికరం లేకుండా పక్కకు లాగి ముళ్లపొదల్లో పడేశారు. ఆ వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి తరలించి ఉంటే బహుశా ప్రాణాలు నిలిచేవేమో. జగన్‌కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా? మనుషుల ప్రాణాలంటే ఏమాత్రం లెక్కలేదా? ఇద్దరు వ్యక్తులు మరణించినప్పటికీ జగన్ తన పర్యటనను యథావిధిగా కొనసాగించారు" అని మంత్రి అనిత ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన తప్పును సమర్థించుకోవడం మరింత దారుణమని ఆమె వ్యాఖ్యానించారు. "జగన్ రాజకీయ ముసుగులో ఉన్న ఒక నేరస్థుడు. గతంలో సత్యసాయి జిల్లాకు వెళ్లినప్పుడు కూడా అక్కడ రచ్చ రచ్చ చేశారు. పొదిలి వెళ్లినప్పుడు మహిళలు, పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. రెంటపాళ్లకు వెళ్లినప్పుడు కూడా పోలీసులు ఎంత చెప్పినా వినకుండా వ్యవహరించారు. ఇరవై ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న వ్యక్తికి పరామర్శకు ఎలా వెళ్లాలో తెలియదా? కేవలం బలప్రదర్శన చేయడానికే జగన్ బయటకు వస్తున్నట్లు కనిపిస్తోంది. 'రప్పా రప్పా' అంటే తప్పేంటని అడగడం ఆయన మానసిక స్థితికి అద్దం పడుతోంది" అని అనిత తీవ్రంగా విమర్శించారు.

**జగన్ భద్రతపై స్పష్టత:**




మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి కల్పిస్తున్న జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేవని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఆయన భద్రతకు సంబంధించి చేస్తున్న ఆరోపణలను ఆమె ఖండించారు. జగన్‌కు నిబంధనల ప్రకారం కేటాయించాల్సిన పూర్తి స్థాయి భద్రతను పోలీస్ శాఖ కల్పిస్తోందని తెలిపారు. ఆయనకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా రోజూ ఆయన వద్దకు వెళ్తుందని, అయితే, జగన్ ఆ వాహనాన్ని ఉపయోగించకుండా తన సొంత వాహనంలోనే ప్రయాణిస్తున్నారని మంత్రి వివరించారు. "ఆయన బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఎక్కినా, ఎక్కకపోయినా, జెడ్ ప్లస్ భద్రత ఉన్న వ్యక్తికి నిబంధనల ప్రకారం ఆ వాహనాన్ని అందుబాటులో ఉంచడం మా బాధ్యత," అని అనిత పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎవరి భద్రత విషయంలోనూ పక్షపాతంగా వ్యవహరించదని, పూర్తి పారదర్శకంగా ఉంటుందని హోంమంత్రి హామీ ఇచ్చారు. అయినప్పటికీ, కొందరు కావాలనే విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆమె ఆరోపించారు. ఇటీవల రెంటచింతల ఘటనను ప్రస్తావిస్తూ, "గంగమ్మ జాతరలో గొర్రెపోతులను నరికినట్లు నరుకుతాం" అంటూ కొందరు చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారి, సమర్థించిన వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని అన్నారు.

**వైసీపీ నేతల తీరుపై మండిపాటు:**

కొంతమంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఒక చేత్తో గొడ్డలి, మరో చేత్తో పార్టీ జెండా పట్టుకుని రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, ఇలాంటి వారిని జగన్మోహన్ రెడ్డి ప్రోత్సహిస్తున్నారని హోంమంత్రి అనిత ఆరోపించారు. "ఒకరేమో నరికేస్తాం అంటారు, ఇంకొకరేమో కోసేస్తాం అంటారు. ఇలాంటి హింసాత్మక వ్యాఖ్యలు చేయడం తప్పు కాదా అని ప్రశ్నిస్తే, సినిమా డైలాగ్ కదా అంటున్నారు. సినిమాల్లో చంపడం చూపిస్తే, దాన్ని బయట కూడా ఆచరించవచ్చా?" అని ఆమె నిలదీశారు. ఇలాంటి వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటే, వేధిస్తున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఇలాంటి హింసను ప్రేరేపించే వ్యక్తులకు స్థానం ఉండకూడదని అనిత అన్నారు. "2029లో మళ్లీ మేమే వస్తాం, ఇలాంటి హింసనే కొనసాగిస్తాం అన్నట్లుగా పరోక్షంగా సమాజానికి తప్పుడు సంకేతాలు పంపే ధోరణి జగన్మోహన్ రెడ్డిలో కనిపిస్తోంది. దీనిపై రాష్ట్ర ప్రజలు ఆలోచించుకోవాలి," అని ఆమె వ్యాఖ్యానించారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులు ఎవరైనా అది చూస్తే వారికి సహాయం చేస్తారని, గాయపడిన వారిని దగ్గరుండి ఆసుపత్రికి తరలిస్తారని గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌లో ఇటీవల ఒక ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించి సహాయం అందించిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. కానీ, వైసీపీ నేతలు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని పరోక్షంగా విమర్శించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, హింసను ప్రేరేపించే వారిపై కఠిన చర్యలు తప్పవని హోంమంత్రి హెచ్చరించారు.

# రాజ్యసభకు వెళ్లడం లేదని స్పష్టత

మొదటిపేజీ తరువాయి

తిరస్కరిస్తారనడానికి ఇది స్పష్టమైన సంకేతమని తెలిపారు. ప్రజలు అఖండ మద్దతుతో ఆప్ పాలనను ఆమోదించారని చెప్పారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అలాగే తాను రాజ్యసభకు వెళ్లడంపై కూడా ఆయన క్లారిటీ ఇచ్చారు. "మేం 2022లో గెలిచిన దానికంటే దాదాపు రెట్టింపు తేడాతో ఇప్పుడు గెలిచాం. పంజాబ్‌లో మెరుగైన పాలన ఉందని మరోసారి నిరూపితమైంది. కొంతమంది ఇది 2027కి సెమీఫైనల్ అని చెబుతున్నారు, 2027లో ఆప్ తుఫాను వస్తుందని అంటున్నారు. మాకు భారీ మెజారిటీ విజయం ఇవ్వడం ద్వారా, పంజాబ్ ప్రజలు రాష్ట్రంలో ఆప్ పనికి తమ ఆమోద ముద్ర వేశారు" అని కేజ్రీవాల్ తెలిపారు. బీజేపీకి కంచుకోట అయిన గుజరాత్‌లో ఆప్ విజయ ప్రాముఖ్యాన్ని కేజ్రీవాల్? నొక్కి చెప్పారు. "ఉపఎన్నికల్లో అధికార పార్టీ గెలుస్తుందని తరచూగా చెబుతారు. కానీ గుజరాత్‌లో మా విజయం ప్రజలు 30 సంవత్సరాల బీజేపీ పాలనతో విసుగు చెందారని చూపిస్తుంది. వారు ఇప్పుడు ఆప్‌ను విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. బీజేపీతో చేతులు కలిపి కాంగ్రెస్ పనిచేస్తుంది" అంటూ ఆరోపించారు. "ఆప్‌ను ఓడించడానికి కాంగ్రెస్ నాయకత్వం బీజేపీకి ఎలా సహాయపడిందో ఉప ఎన్నికలు నిరూపించాయి. కాంగ్రెస్ బీజేపీకి కీలకంగా మారింది. దీనిని గ్రహించి ఆప్‌లో చేరాలని నేను కాంగ్రెస్ కార్యకర్తలను అభ్యర్థిస్తున్నాను. ప్రజలు మా పని పట్ల సంతోషంగా ఉన్నారని ఇది ఒక పెద్ద సూచన" అని తెలిపారు. ఉపఎన్నికల్లో గెలిచిన గోపాల్ ఇటాలియా, సంజీవ్ అరోరాకు కేజ్రీవాల్ అభినందనలు తెలిపారు. వారి విజయాలు గుజరాత్‌లో పోటీ ఇప్పుడు ఆప్, బిజేపీ మధ్య నేరుగా ఉందని సూచిస్తున్నాయని చెప్పారు. అధికార పార్టీతో బీజేపీ స్నేహపూర్వక సంబంధాన్ని కలిగి ఉందని ఆరోపించారు. అయితే సంజీవ్ అరోరా విజయం సాధించిన తర్వాత, తాను రాజ్యసభకు వెళ్లబోనని కేజ్రీవాల్ తెలిపారు. అరోరా స్థానంలో పార్టీ అధినేత కేజ్రీవాల్ ఎగువ సభలోకి వెళ్తారని కొద్దిరోజులుగా వార్తలు వస్తున్నాయి.

# డ్రగ్స్ మహమ్మారి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- డ్రగ్స్ నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి
- ప్రతి విద్యార్థి,యువత యాంటీ డ్రగ్ సోల్జర్ మారాలి.
- మాదకద్రవ్యాల దుర్వినియోగం - అక్రమ రవాణా అవగహన వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో 2%౧% రన్
- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాధకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన 2%ఖ% రన్ కు భారీ స్పందన
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్న,పెద్ద,యువతి,యువకులు, విద్యార్థిని విద్యార్థులు,పోలీస్ అధికారులు,సిబ్బంది
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్







**తెలంగాణ సేన, జూన్ 23,వేములవాడ :** డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తును అందించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ప్రతి విద్యార్థి, యువత 'యాంటీ డ్రగ్ సోల్జర్'గా మారాలని ఆయన కోరారు.మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా అవగాహన వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2%ఖ% రన్‌కు ప్రజల నుండి భారీ స్పందన లభించింది. ఈ ర్యాలీలో చిన్న, పెద్ద, యువతీ, యువకులు, విద్యార్థిని విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు 'డ్రగ్-రహిత సమాజమే లక్ష్యంగా' ఈ 2%ఖ% రన్ విజయవంతంగా జరిగింది.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తును అందిద్దామని పిలుపునిచ్చారు. యువత గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తు వైపు నడుచుకోవాలని తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంలో యువత, ప్రజలు పోలీసులకు సహకరించి కీలక పాత్ర పోషించాలని కోరారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం-అక్రమ రవాణా అవగాహన వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ వివరించారు. '%×%'%వీ ూచీ× ఇ=ఖ+ ూూణ×జు=%' అని ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థులు, యువత, అధికారులు ఆసక్తిగా ఫొటోలు దిగారు.అనంతరం ర్యాలీకి వచ్చిన విద్యార్థులతో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. "నేను మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీలక భాగస్వామి అవుతానని, డ్రగ్స్ వాడటం వలన కలిగే దుష్పరిమాణాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి నాతోపాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మిన, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తానని, డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామ్యం అవుతానని ప్రతిజ్ఞ చేస్తున్నాను" అని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.గంజాయి వంటి మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో నెంబర్ 8712671111కి లేదా డయల్ 100కి లేదా తమ పరిధిలో ఉన్న పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐలు మొగిలి, నాగేశ్వరరావు, నటేష్, మధుకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవి, ఆర్ఐలు మధుకర్, రమేష్, ఎస్ఐలు కిరణ్ కుమార్, రామ్మోహన్, శ్రీకాంత్, లక్ష్మణ్, శ్రీనివాస్, ఆర్ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# దళారి వ్యవస్థ లేని వాణిజ్య పంట ఆయిల్ ఫామ్

ప్రకృతి వైపరీత్యాలు చీడపీడల తో ఇబ్బందులు

కలగకుండా రైతులకు లాభదాయకం

రెవెన్యూ అదనపు కలెక్టర్ జి వీరారెడ్డి



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, జూన్ 23 :** ప్రకృతి వైపరీత్యాల సమస్యలు లేకుండా, రైతులకు లాభదాయకమైన ఆయిల్ ఫామ్ పంటలను ,ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రెవెన్యూ అదనపు కలెక్టర్ జి వీరారెడ్డి తెలిపారు. సోమవారం భువనగిరి మండలం నందనం గ్రామంలో డా. ఎ.శ్రీనివాస్ 23 ఎకరాల మొత్తం విస్తీర్ణం పొలంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, "ఆయిల్ పామ్ పంటను ప్రస్తుతం వాణిజ్య పంటగా సాగు చేయడం జరుగుతుంది అని ,పంట వేసిన 4 వ సంవత్సరం నుంచి ఆయిల్ పామ్ లో పంట చేతికి అంది దిగుబడి వస్తుంది అన్నారు. పంట సాగులో మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటగా పెసర పత్తి మిర్చి బొప్పాయి వేరుశనగ వంటి పంటలను సాగు చేసుకునే వీలు ఉందని, రైతులు లాభదాయకమైన ఆదాయం పొందవచ్చు అని వివరించారు. పంట సాగుతో రైతుకు ఎకరాకు 1.5 నుంచి 2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది అని తెలిపారు. రైతులు ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయడం ఎంతో లాభదాయకం అని సూచించారు. పంట సాగులో చీడ పీడలు , కోతుల బెడద, ప్రకృతి వైపరీత్యాల సమస్యలు ఉండవు అని అన్నారు. దళారీ వ్యవస్థ ఉండదు అని పేర్కొన్నారు . ఎకరాకు 57 మొక్కల చొప్పున రాయితీ పై,రూ. 20 కే రైతుకు అందజేయడం జరుగుతుంది అన్నారు. అదే విధంగా డ్రిప్పు పైపుల కు రాయితీలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎస్సి ఎస్టి లకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఓసీ లకు 80 శాతం రాయితీ తో డ్రిప్పు పైపులు సరఫరా చేయబడ నున్నట్లు తోట నిర్వహణ యాజమాన్య ఖర్చుల అంతర్ పంట సాగు కు ప్రభుత్వం రైతుకు నాలుగు సంవత్సరాల వరకు ఎకరానికి సంవత్సరానికి ,రూ. 4,200 చొప్పున రైతు ఖాతాలో జమ చేయడం జరుగుతుంది" అని తెలియజేసారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ , ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, ఎం .పి. డి.ఓ శ్రీనివాస్ , ఏడిఏ వెంకటేశ్వర్లు , రైతు, రైతు సమాఖ్య సభ్యులు విజయపాల్ రెడ్డి , ఉద్యాన అధికారులు మాధవి, స్నేహిత, కవిత, స్రవంతి, ఎం ఏ ఓ భువనగిరి మల్లేష్ , తెలంగాణ ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి, ఖాజా , ఏ ఈ ఓ ప్రసన్న, తెలంగాణ ఆయిల్ ఫెడ్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పాలన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హేలన

ఇందిరమ్మ రాజ్యం ప్రతి పెద వాడి

ఇంటి సౌభాగ్యం కాంగ్రెస్ పార్టీ సీనియర్

నాయకుడు: మాధగోని జంగయ్య గౌడ్



**మంచాల, తెలంగాణ సేన న్యూస్ :** మంచాల మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ మాట్లాడుతూ. అనాడు ఇందిరా గాంధీ ప్రధాన మంత్రి పాలనలో గరిబ్ హటావో నినాదంతో ప్రతి పెద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ అదేదారిలో మళ్ళీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్. రాజశేఖరరెడ్డి పాలనలోఎ ఒక్క పెదవాడు పూరీ గుడిసెలో ఉండ వద్దు అని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు. చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కింది అనాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు పింఛన్లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు. పెద ప్రజల కోసం ఇంకఎన్నో సంక్షేమ పథకాలు ప్రేవేశపెట్టీ పెద ప్రజలను అదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్నారు. పదేండ్ల పాలనంలో బిఅర్ఎస్ ప్రభుత్వం గత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి పాలనలో ప్రవేశపెట్టిన పథకాలే కాపి కొట్టి సంక్షేమ పథకాలు అమలు చేశారు. తప్పపదేండ్ల పాలనలో ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు కని ఇండ్లుకాని మంజూరు చేయలేదు అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రతి ఇంటికి 200 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంట గ్యాస్ పై 500 వందల రూపాయల సబ్సిడీ పేద ప్రజల కోసం రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, వరి పంటకు మద్దతు ధర క్వింటాలుకు 500 రూపాయల బోనస్, రాజీవ్ ఆరోగ్య శ్రీ, 10 లక్షలకు పెంపు పెద ప్రజల కోసం కొత్త రేషన్ కార్డులు మంజూరు పెద ప్రజల కోసం వైద్యం ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్, మహిళలకు ఉచిత బస్సు, ప్రయాణం పేదింటి ఆడపడుచుల వివాహాలకు కళ్యాణ లక్ష్మి పథకం కొత్తగా ఉద్యోగ అవకాశాలు ప్రజలను ఆదుకోవటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారాధ్యంలో ఇంక ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం కాంగ్రెస్ పార్టీ పాలన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు పాలన అన్నట్టుగా పాలన సాగిస్తున్న గొప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించు కుంటే గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయి అన్నారు.

# ప్రజావాణితో సమస్యల పరిష్కారం

– కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

– మొత్తం 261 దరఖాస్తులు రాక





**తెలంగాణ సేన,జూన్ 23,వేములవాడ :** ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం అర్జీలు స్వీకరించారు.అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ప్రజావాణికి మొత్తం 261 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ శాఖకు 106, హౌసింగ్ శాఖకు 53, డీఆర్డీఓకు 34, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి 14, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు 12, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారికి ఐదు చొప్పున, జిల్లా వ్యవసాయ అధికారికి నాలుగు, సిస్ కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ వేములవాడకు మూడు చొప్పున, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్, ఎస్పీ కార్యాలయం, ఎస్సీ కార్పొరేషన్, అటవీశాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ, ఎంపీడీఓ గంభీరావుపేట, జీఎం ఇండస్ట్రీస్, జిల్లా వైద్యాధికారి, వేములవాడ రాజన్న ఆలయ ఈఓకు రెండు చొప్పున, ఎంపీడీఓ ముస్తాబాద్ కు ఒక దరఖాస్తువచ్చింది. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాత నోటుబుక్కుల వితరణ



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి జూన్ 23 :** హుజురాబాద్ మండలం శాలపల్లి ఇందిరానగర్ కు చెందిన చిన్నక్క మల్లారెడ్డి తన తండ్రి చిన్నక్క పాపిరెడ్డి జ్ఞాప కార్థం శాలపల్లి ఇంద్ర నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు నోటుబుక్స్ అందజేసి ఉదారత చాటుకు న్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి 6 నోట్ బుక్స్ మరియు ప్రతి విద్యార్థికి స్టూడెంట్ డైరీ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను బాగా చదివి క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచిం చారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలపల్లి పద్మశాలి సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు వీ రమేష్, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీ శారద పాఠశాల తరుపున మల్లారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి జూన్ 23 :** హుజురాబాద్ మున్సిపాలిటీ 13వ వార్డులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల గృహ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం సోమవారం జరిగింది. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి సందమల్ల బాబు, పట్టణ మహిళా అధ్యక్షురాలు వేముల పుష్పలత, యువజన కాంగ్రెస్ నాయకులు సందమల్ల నరేష్, పార్టీ సీనియర్ నేతలు మోరే తిరుపతి, కొండ్ర అజయ్, కొండ్ర కనకయ్య, వార్డు ఆఫీసర్ రాము తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు ఆవాసం కల్పించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకొస్తామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలతో పేదల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వారు హామీ ఇచ్చారు.



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, జూన్ 23 :** తెలంగాణ సమాచార హక్కు కమిషనర్ హెూదాలో తొలిసారి యాదగిరిగుట్ట దైవ దర్శనం కోసం వచ్చిన బోరెడ్డి అయోధ్య రెడ్డి కి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఎం, హనుమంతరావు ఆర్డీవో కృష్ణా రెడ్డి, తహసీల్దార్‌లు

# చిలకమ్మా వాన చినకమ్మ.... ఒక్కసారన్నా వచ్చి పోవమ్మా.....!!

వరుణదేవుడి కరుణ కోసం ఆకాశం వైపు ఆశగా

ఎదురుచూస్తున్న రైతన్నలు.....!!!

గందరగోళంగా వాతావరణ పరిస్థితులు

ఎండా కాలంలో వర్షాలు.. వానాకాలంలో ఎండలు

జూన్‌లో 77 శాతం లోటు వర్షపాతం నమోదు

మండలాల్లో తీవ్ర వర్షాభావం

మొలకెత్తని పత్తి విత్తనాలు...

సంస్థాన్ నారాయణపురం







**తెలంగాణ సేన,జూన్ 23 :** మే నె లలో మురిపించిన వర్షాలు జూన్‌లో ముఖం చాటేశాయి. మండలంలోని గ్రామాలలోని రైతులు వాన (వర్షాల) కోసం ఎదురుచూస్తున్నారు, కరుణించవా వరుణ దేవా అని ప్రార్థిస్తున్నారు, పత్తి గింజలు పెట్టిన రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు, మృగశిర కార్తి ఎల్లి ఆరుద్ర కార్తి వస్తుంది కానీ వర్షాలు రాకపోయే రైతులు పెట్టిన పత్తి గింజలు మొలిచిన మొలకలు కాస్త వాడు మొఖం పట్టాయి, అప్పులు తెచ్చి మరి కౌలుకు పట్టిన రైతులు వేలకు వేలు పెట్టుబడి పెట్టి ఇలాగైతే వ్యవసాయం ఎలా చేయాలో మరి కాలం సహకరించకపోతే వర్షాలు లేకపోతే అనేక ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు, నారు పోదామంటే కాలం కాక బోర్లు పోయకపాయ రెండు మూడు వందల ఫీట్లు బోర్లు వేసిన నీరు చుక్క లేక పాయె కార్తెలు వెళ్తుంటే దిక్కు దిక్కుతోచని ఆ యోమయ పరిస్థితుల్లో రైతులు ఉన్నారు, ఇట్లా అయితే ఎలానో మరి అట్లా బ్రతకాలో అని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ఇప్పటివరకు పత్తి గింజలు రెండు మూడు సార్లు పెట్టామని పత్తి గింజల ప్యాకెట్లు రేట్లు కూడా అధికంగా ఉన్నాయని తెలిపారు. వర్షాలు రాకపోతే కాలం సహకరించకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యము అంటున్నారు, ఏం చేయలేని దిక్కుతోచని పరిస్థితులో ఎట్లా అని ఆలోచనలో పడ్డారు. వానాకాలం ప్రారంభమై 20 రోజులు దాటినా చి నుకు జాడ లేదు. జూన్‌లో నైరుతి రుతుపవనాల ప్ర భావంతో భారీ వర్షాలు కురవాల్సి ఉండగా, జిల్లాలో 77 శాతం లోటువర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి 21 వరకు 111.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కా గా ఇప్పటికీ 34.2 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. జిల్లాలోని 15 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. ముందస్తువర్షాలు చూసి పత్తి విత్తనాలు వేసుకున్న రైతులు వర్షం కోసం నిరీక్షిస్తున్నారు. జిల్లాలో దాదాపు గా 70 శాతం మంది రైతులు పత్తి విత్తనాలు వేసుకు న్నారు. మొలకలు రాక వారంతా తీవ్ర ఆందోళన చెం దుతున్నారు. మరో రెండు మూడు రోజుల్లో వర్షం రాక పోతే విత్తులన్నీ నేలలోనే పాడైపోతాయని ఆందోళన చెందుతున్నారు. వరుణదేవుడి కరుణ కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. వానలు కురియాలని కప్ప తల్లి ఆడుతూ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

### 1.58 లక్షల ఎకరాల్లో పత్తిసాగు

జిల్లాలో 1.58,753 ఎకరాల్లో పత్తి సాగవుతుందని అ ధికారులు అంచనాలు రూపొందించారు. దాదాపు రై తులందరూ వర్షాధారంగానే పత్తి సాగు చేస్తారు. తొలకరి వర్షాలకే విత్తనాలు వేసుకుంటే పంట మంచిగా ఎదిగి ఆశించిన దిగుబడి వస్తుంది. మేలోనే చేలన్నీ లో తుదుక్కులు వేసుకొని సిద్ధం చేసుకున్నారు. పొడి చేల ల్లోనే రోటవేటర్, కల్టివేటర్‌తో చదును చేసి విత్తనాలు వేసుకుంటున్నారు. ఇప్పటి వరకు దాదాపుగా 70 శాతం రైతులు పత్తి విత్తుకున్నారు. తడిపొడి దుక్కిలో పడిన విత్తులు మొలకవచ్చి పదను లేక మాడి పోతు న్నాయని రైతులు పేర్కొన్నారు.

### మండలాల్లో తీవ్ర వర్షభావం

ఏడు వాతావరణ పరిస్థితులు గందరగోళంగా ఉన్నాయి. ఎండలు దంచి కొట్టాల్సిన రోహిణి కార్తె (మే నెల)లో అకాల వర్షాలు కురిశాయి. రోజుల తరబడి మ బ్బులు కమ్ముకొని ఉన్నాయి. జిల్లాలో మే నెలలో భారి వర్షాలు కురిసి, 149 మిల్లీ మీటర్ల వర్షపాతం నమో దైంది. ఎన్నడూ లేని విధంగా ఈ యేడు నైరుతి రుతు పవనాలు మే చివరి వారంలోనే ప్రవేశించడంతో వ ర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఆశపడి సాగు పనులు ప్రారంభించారు. మృగశిరలో దంచి కొట్టాల్సిన వర్షాలు కార్తె ముంగింపునకు వచ్చి ఆరుద్ర ప్రారంభమవుతున్న వేళ కూడా వానల జాడ లేదు. జూన్ 21 వరకు సాధా రణ వర్షపాతం 111.7 మిల్లీమీటర్లు కాగా 77 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి 21 వర కు 34.2 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే కురిసింది. జిల్లాలో ప్రస్తుతం 32 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. మునుగోడు, సంస్థాన్ నారాయణపురం, చండూర్, గట్టుప్పల్, మర్రిగూడెం, చౌటుప్పల్, మండలాలు తప్ప మిగతా 15 మండలాల్లో తీవ్ర వర్ష భావ పరిస్థితులు నెలకొన్నాయి. అప్పుడప్పుడు మబ్బులు కమ్ముకొని గాలులు వీస్తున్నప్పటికీ వర్షం మాత్రం రావడం లేదు. ఈ నెల 25 వరకు జిల్లాలో తేలికపాటి వర్షాలు మాత్రమే కురిసే అవకాశం ఉందని ఉమ్మడి నల్గొండ జిల్లాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం తాజా బులెటిన్‌లో వెల్లడించింది. వాతావరణ ని పుణులు వర్షాలు కురుస్తాయిని చెబుతున్నప్పటికీ వాన జాడ మాత్రం కానరావడం లేదు.

### వర్షం లేక పత్తి విత్తనాలు మొలకెత్త లేదు


**నలపరాజు పద్మ స్వామి, పత్తి రైతు, సంస్థాన్ నారాయణపురం మండలం**

ముందుగా కురిసిన వర్షాలకు జూన్ రెండో వారం లోనే 18 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాను. అప్పటి నుంచి వర్షం లేదు. నాలుగైదు రోజుల్లో మొలక రావాల్సి ఉండగా ఇప్పటి వరకు మొలకలు కనిపించడం లేదు. పదను ఉన్న చోట పడిన కొన్ని విత్తులు మొల కెత్తినప్పటికీ ఎండ వేడికి వడలిపోతున్నాయి. భూమిలో పదును లేక నేలలోనే విత్తనాలన్ని వట్టిపోతున్నాయి. ఇప్పటికిప్పుడు వర్షాలు వచ్చినప్పటికి 30 శాతం విత్తు లు మరోసారి వేసుకోవాల్సి వస్తుంది. ఈ ఏడు సీజన్ ప్రారంభంలోనే ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం పరిస్థితుల్లో రైతులు జూలై 15 వరకు విత్తనాలు వేసుకునే సమ యం ఉంది. భూమిలో కనీసం తేమ కూడా లేకముందే విత్తుకుంటే మొలకలురావు. తేలికపాటి నేలల్లో 50 నుంచి 60 మిల్లీ మీటర్లు, బరువు నేలల్లో 60 నుంచి 75 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తరువాతనే వి త్తనాలు వేసుకోవాలి. కనీసం 20 సెంటీమీటర్ల లోతు వరకు భూమి తడిసిన తరువాతనే వరి, పత్తి, జొన్న, కంది, పెసర పంటలు విత్తుకోవాలి. తడిపొడి నేలల్లో విత్తనాలు వేసుకుంటే భూమి లోపలి నుంచి వచ్చే వేడికి మొలకె శాతం తగ్గుతుంది.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 36 ఫిర్యాదులు స్వీకరణ

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్



**తెలంగాణ సేన, జూన్ 23,వేములవాడ :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే ఐపీఎస్ తెలిపారు.ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# బూర్గంపహాడ్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో రగులుతున్న పోడు నిప్పులు

**ఆదివాసీలపై అటవీ శాఖ అరాచకాలు %-% ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకం!**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు**

**వెంకగారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863**

**నిర్మల్/జూన్ 23/తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపహాడ్ మాత్రమే కాదు, ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ వంటి అనేక గిరిజన ప్రాంతాలు ఇప్పుడు అట్టుడుకుతున్నాయి. తరతరాలుగా పోడు భూములను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలపై అటవీ శాఖ అధికారులు జరుపుతున్న దాడులు, మహిళల పట్ల అనుచిత ప్రవర్తన, ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టా భూముల్లో సైతం అటవీ పెంపకం చేపట్టడం వంటి చర్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. గతంలో అటవీ అధికారుల దాడుల్లో గాయాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఆదివాసీ మహిళల ఘటనలు, 'ఆపరేషన్ కగర్' పేరిట జరుగుతున్న నిర్బంధం %-% ఇవన్నీ "ఇది ప్రజాస్వామ్యంలో ఉన్నామా?" అనే ప్రశ్నను బలంగా సంధిస్తున్నాయి.పోడు భూములపై పీఠముడి: ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా అటవీ శాఖ చర్యలు దశాబ్దాలుగా పోడు వ్యవసాయం ఆదివాసీల జీవనాధారం. అటవీ సంరక్షణ చట్టాల పేరిట అటవీ శాఖ అధికారులు వారిని సాగు భూముల నుంచి బలవంతంగా వెళ్లగొట్టాలని ప్రయత్నిస్తుండటంతో ఆదివాసీలకు, అటవీ శాఖకు మధ్య సంఘర్షణ అనివార్యమైంది. బూర్గంపహాడ్‌తో పాటు ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లోకి అటవీ అధికారులు అకస్మాత్తుగా ప్రవేశిస్తున్నారు. వీరికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే పొలాలను ధ్వంసం చేయడం, పండిన పంటలను నరికివేయడం, గుంతలు తవ్వి బలవంతంగా మొక్కలు నాటడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆదివాసీ సంఘాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ఈ అటవీ శాఖ చర్యల వల్ల వేలాది మంది ఆదివాసీ కుటుంబాలు నిరాశ్రయులవుతున్నాయని, వారి జీవనాధారం తీవ్రంగా దెబ్బతింటుందని వాపోతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేసి, వారి భూ హక్కులను గుర్తించినప్పటికీ, అటవీ శాఖ మాత్రం పట్టాలు పొందిన భూముల్లో కూడా అటవీ పెంపకం చేపడుతుండటం తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో, అటవీ శాఖ అధికారులు పంపిణీ చేసిన పట్టాలున్న భూముల్లోనూ మొక్కలు నాటారని, దీనిపై స్థానిక ఆదివాసీలు తీవ్రంగా ప్రతిఘటించారని నివేదికలు చెబుతున్నాయి. "ఇది ప్రభుత్వ విధానాలకు, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ఉంది. అటవీ శాఖ అధికారులు తమ సొంత అజెండాతో ఆదివాసుల హక్కులను కాలరాస్తున్నారు," అని ఆదివాసీ నాయకులు, ప్రజా సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

**మహిళలపై దౌర్జన్యం, లైంగిక వేధింపుల ఆరోపణలు: మానవ హక్కుల ఉల్లంఘన**

అటవీ అధికారుల దాడుల్లో ఆదివాసీ మహిళలు ముఖ్యంగా లక్ష్యంగా మారుతున్నారని తీవ్ర ఆరోపణలున్నాయి. బూర్గంపహాడ్‌లోనే కాకుండా, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోనూ అటవీ అధికారుల తీరుపై మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం భూముల నుంచి బలవంతంగా వెళ్లగొట్టడమే కాకుండా, శారీరక దాడులు, బెదిరింపులకు పాల్పడటం, కొన్నిచోట్ల లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తన, అగౌరవంగా మాట్లాడటం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని బాధితులు వాపోతున్నారు.గతంలో బూర్గంపహాడ్‌లో అటవీ అధికారులు జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడిన పలువురు ఆదివాసీ మహిళలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో కూడా అటవీ అధికారులు, పోలీసులు మహిళలపై దాష్టికాలు ప్రదర్శించారన్న ఆరోపణలున్నాయి. "ఈ ఘటనలు ఆదివాసీ మహిళల భద్రతకు తీవ్ర ముప్పుగా మారాయని మానవ హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అటవీ అధికారుల ఈ దుశ్చర్యలు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకే వస్తాయని, అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలకు విరుద్ధమని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు."

**'ఆపరేషన్ కగర్' %జం% ఆదివాసీ హక్కులు: ప్రజాస్వామ్యంపై సందేహాలు**

అటవీ సంరక్షణ పేరుతో చేపడుతున్న 'ఆపరేషన్ కగర్' (అటవీ భూముల పరిరక్షణకు చేపట్టిన చర్యలు) వంటి కార్యక్రమాలు ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శలున్నాయి. తమ తరతరాల భూములను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తున్న అమాయక ఆదివాసులపై పోలీసులు, అటవీ అధికారులు సంయుక్తంగా దాడులు చేయడం, వారిని అక్రమంగా అరెస్టు చేయడం, తప్పుడు కేసులు బనాయించి క్రిమినల్స్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం అని ఆదివాసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి."మాకు పట్టాలు ఇచ్చారు, కానీ సాగు చేసుకోనివ్వడం లేదు. మహిళలను కూడా కొడుతున్నారు, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. మాకు న్యాయం ఎవరిస్తాడు? ఇది నిజంగా ప్రజాస్వామ్య దేశమేనా?" అని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ ఆదివాసీ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ పరిస్థితులు దేశంలోని గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న అభద్రతా భావానికి, అధికార యంత్రాంగంపై విశ్వాసం సన్నగిల్లుతున్న తీరుకు అద్దం పడుతున్నాయి. చట్టాలు, హక్కులు కేవలం కాగితాలకే పరిమితమా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**ఆందోళనల తీవ్రత, భవిష్యత్ కార్యాచరణ: ఆదివాసుల తిరుగుబాటుకు సన్నద్ధం**

అటవీ శాఖ అధికారుల ఈ అరాచకాలపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని ఆదివాసీ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే బూర్గంపహాడ్‌తో పాటు ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు, అటవీ కార్యాలయాల ముట్టడి వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అసభ్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకునే వరకు, తమ భూ హక్కులను పూర్తిస్థాయిలో గుర్తించే వరకు ఆందోళనలు కొనసాగుతాయని వారు స్పష్టం చేస్తున్నారు. ఆదివాసులు "తిరగబడక తప్పదు" అనే హెచ్చరికలు పరిస్థితి తీవ్రతకు, వారిలో పేరుకుపోయిన ఆగ్రహానికి, నిస్సహాయతకు నిదర్శనం. తమ పూర్వీకుల భూమిని, సంస్కృతిని కాపాడుకోవడానికి వారు ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నారని ఈ హెచ్చరికలు తెలియజేస్తున్నాయి.

**ప్రస్తుతం ఆదివాసీ సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నవి:**

అనుచితంగా వ్యవహరించిన అటవీ అధికారులపై, ముఖ్యంగా మహిళలపై దాడి చేసి, అసభ్యంగా ప్రవర్తించిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి.లైంగిక వేధింపులు, దాడులపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలి మరియు బాధ్యులను శిక్షించాలి.పోడు పట్టాలు పంపిణీ చేసిన భూముల్లో అటవీ శాఖ జోక్యం తక్షణమే నిలిపివేయాలి, అక్కడ అటవీ పెంపకం చర్యలను రద్దు చేయాలి.దాడుల్లో గాయపడిన వారికి, నష్టపోయిన వారికి తగిన పరిహారం అందించాలి, వారికి పూర్తిస్థాయి వైద్య సహాయం కల్పించాలి.ఆదివాసీల భూ హక్కులను గుర్తించి, అటవీ హక్కుల చట్టం 2006ను (%ఖీశీతీవర్ =అస్త్రష్ట్రం ~ాష్%, 2006) పటిష్టంగా, మానవీయ కోణంలో అమలు చేయాలి.పోడు భూముల సమస్యపై శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం, ఆదివాసీ సంఘాలతో వెంటనే చర్చలు జరపాలి, స్పష్టమైన మరియు సమగ్రమైన మార్గదర్శకాలు రూపొందించాలి.తెలంగాణలోని గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న ఈ ఉద్రిక్త పరిస్థితులు ఆదివాసీల భూ హక్కులు, అటవీ సంరక్షణ మధ్య ఉన్న సంక్లిష్టతను, ప్రభుత్వ విధానాల అమలులో ఉన్న లోపాలను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ సమస్యకు తక్షణమే మానవీయ కోణంలో, చట్టబద్ధంగా పరిష్కారం లభించకపోతే, పరిస్థితి మరింత చేయిదాటిపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై తక్షణమే దృష్టి సారించి, ఆదివాసీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి, వారికి భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో, ఈ ఆందోళనలు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పౌరులు ఉద్యమించాలి

**సహజ వనరుల దోపిడీని అడ్డుకున్నందుకే**

**మావోయిస్టులు, గిరిజనుల హత్యలు:**

**ఆపరేషన్ కగార్ ను ఆపాలి**

**ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్ ముట్టడి**

**అరెస్ట్ చేసిన పోలీసులు**




**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నదని, ఈ నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ చౌరస్తా నుండి రాజ్ భవన్ కు ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలను అడ్డుకుని,పోలీసులు అక్రమ అరెస్టు చేశారు.తోపులాటలో పలువురు నేతలకు గాయాలు అయ్యాయి. అరెస్ట్ చేసిన నేతలను పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ దండకారణ్యం తుపాకుల గర్జనతో దద్దరిల్లుతున్నదని, మావోయిస్టులతో పాటు గిరిజనుల నెత్తురు ఏరులై పారుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు నెలలుగా ఏకధాటిగా కొనసాగుతున్న కూంబింగ్ ఆదివాసీ గూడాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నదని, చిన్న అలికిడి జరిగినా, బూట్లచప్పుడు వినిపించినా భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితి నెలకొందని. 'మావోయిస్టు రహిత భారత్' కోసమంటూ చేపట్టిన 'ఆపరేషన్ కగార్' నిజంగా నక్సల్స్ను నిర్మూ లించడం కోసమేనా? అదే నిజమైతే ఆదివాసులను అడవుల నుంచి తరిమేయడం దేనికి? యథేచ్ఛగా మానవ హక్కుల్ని ఉల్లంఘిస్తూ చేస్తున్న ఈ మారణ హోమం వెనుక ఉన్న ఉద్దేశమేంటి? ప్రజల్లో ఉద్భవిస్తున్న ఇలాంటి ప్రశ్నలకు కేంద్ర సర్కార్ సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఎందుకంటే, స్వాతంత్ర్యం వచ్చినప్పటి ప్రభుత్వాలెన్నో మారినా మునుపెన్నడూ లేని విధంగా దేశంలో రాజ్యహింస పెచ్చరిల్లిందని, దీనికి కారణాలేంటని లోతుగా పరిశీలిస్తే, అడవుల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్న ఖనిజ నిక్షేపాలు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు అప్పనంగా అటవీ సంపదను దోచి పెట్టేందుకే ఈ నరమేధం. 'ఖనిజ' వేట అందులో భాగమేనని వారు ఉద్ఘటించారు.ఛత్తీస్ గడ్ లో బొగ్గు, ఇనుము, సున్నపు రాయి, డోలమైట్, బాక్సైట్ నిక్షేపాలకు ప్రసిద్ధి. దేశంలో టిన్ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే ఏకైక రాష్ట్రం ఇదేనన్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదపై దేశ బడా కార్పొరేట్ల కన్నుపడిందని, అత్యున్నత స్థాయి గ్రేడ్ ఇనుప ఖనిజం (హెమటైట్) ను వారికి కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కేంద్రం ఒప్పందం కూడా చేసుకుందని వారు తెలిపారు. ఈఏడాది జనవరిలో ఏడువేల ఎకరాల్లో నాలుగు పదమూడవ ఖనిజ బ్లాకుల వేలానికి సిద్ధమైందని, అయితే ఈ ఖనిజ తవ్వకాలతో ఎక్కువ నష్టం జరిగేది అక్కడ నివసించే ఆదివాసులకేనన్నారు. అడవివి, వారిని విడదీసి చూడలేమని,ఈ తెగలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు సర్కార్లు చేయని కుట్రలేదన్నారు.ఆపరేషన్ కగార్ అంశాన్ని దేశంలోని పౌరులు నిశితంగా అధ్యయనం చేయాలని తెర వెనుక జరుగుతున్న పరిణామాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, దేశ సంపద ప్రజలందరికీ చెందాలే తప్ప బడా పెట్టుబడిదారీ కార్పొరేట్ లకు కాదని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21 జీవించే హక్కును కాలరాస్తున్న నరేంద్రమోదీ విధానాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్తామని వారు తెలిపారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్,చేపూరి కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్. బాలక్రిష్ణ, చిలుక రాజ్ శ్రీను, సల్మాన్ బేగ్, శివ కుమార్, మహమూద్, మాజీద్, కొండూరి వెంకటేష్, అశోక్, బిచ్చల శ్రీనివాస్,హేమంత్, నయీమ్, అశోక్,వెంకటేష్, సురేష్, మధు, మధుకర్,శోభన్, వీరన్న, వెంకట్, రజనీకాంత్, నాగేశ్వరరావు, సంజయ్,వర్మ, గణేష్ లతో పాటు 30మంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యకు సంబంధించిన డిమాండ్లపై వినతి పత్రం అందజేసిన ఆమ్ ఆద్మీ పార్టీ



**తెలంగాణ సేన న్యూస్ :** రంగారెడ్డి జిల్లా,కలెక్టర్ తెలంగాణ రాష్ట్రం:విద్యా హక్కు చట్టం (%=ఞ ~ాష్%, 2009) అమలు, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ మరియుప్రభుత్వ పాఠశాల విద్యకు సంబంధించిన ముఖ్యమైన డిమాండ్లపై వినతి.ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రంలో విద్య తల్లిదండ్రులకు భారం, విద్యార్థులకు ఒత్తిడిగా మారింది. ప్రైవేటు పాఠశాలల అధిక ఫీజులు కుటుంబాలపై తీవ్ర ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ఫీజులు చెల్లించలేకపోతే విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం, %ఞజ% ఇవ్వకపోవడం వంటి దుర్మార్గమైన చర్యలతో పిల్లలు మానసికంగా బాధపడుతున్నారు. మరోవైపు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మూసివేతలు, పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం రాష్ట్ర విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టివేసింది. "ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలల స్థాయికి తీసుకెళ్తాం" అన్న హామీలను కాంగ్రెస్ ప్రభుత్వంనిలబెట్టుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగంలో కొనసాగుతున్న అన్యాయాలపై మరియు విద్యార్థుల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం తీసుకుంటున్న అలసత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా విద్యా హక్కు చట్టం, 2009 (%=ఞ ~ాష్%) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25% సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సిన నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయకపోవడం ఆందోళనకరం.జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో క్షీణిస్తున్న పారిశుద్ధ్యం మరియు ప్రజారోగ్య సమస్యలపై తక్షణ దృష్టి.స్థానిక వర్గాల నుండి అభిప్రాయాన్ని స్వీకరించిన తర్వాత, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా యూనిట్ నగర ప్రాంతంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన మా పరిశీలనలు మరియు ఫిర్యాదులను మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాము.ఈ పాఠశాలల్లోని మరుగుదొడ్ల స్థితి పనిచేయకపోవడం లేదా చాలా అపరిశుభ్రంగా ఉండటం గమనించడం మాకు తీవ్ర నిరాశ కలిగించింది. అవి పిల్లల ఆరోగ్యానికి, ముఖ్యంగా చిన్న పిల్లల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తున్నాయి.ఉపాధ్యాయులు మరియు సంబంధిత ప్రధానోపాధ్యాయులు పాఠశాలను చక్కగా మరియు శుభ్రంగా ఉంచే వారి విధికి మరియు సామర్థ్యాన్ని మించిపోతున్నారు, అయితే ఆయమ్మ, భద్రత మరియు నిర్వహణకు తగినంత నిధులు లేకపోవడం ఈ పరిస్థితికి దారితీస్తోంది.తరగతి గదులు ఒక దేశాన్ని నిర్మించే ఇటుకలు. దేశం యొక్క విధి దాని పాఠశాలల్లో వ్రాయబడింది, కాబట్టి వాటిని పవిత్రంగా పరిగణించాలి. మరియు సహజ స్థితిలో నిర్వహించాలి. ఆమ్ ఆద్మీ పార్టీ వారి ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా అందరికీ "ఒక దేశం ఒక విద్య"ని గట్టిగా నమ్ముతుంది.కాబట్టి, పాఠశాలలు ప్రారంభం అయ్యి దాదాపు పది రోజులు అవుతుంది, విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలనే మా డిమాండ్లను మేము వినయంగా సమర్పిస్తున్నాము.తరగతి గదులు, విరిగిన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, ఆట స్థలాల పరిస్థితి మొదలైన వాటిలో లోపాలను గుర్తించి పరిష్కరించడానికి "పాఠశాల మౌలిక సదుపాయాలు %ఱ% పరిశుభ్రత సర్వే" నిర్వహించండి.ఆయమ్మల సంఖ్యను 150 మంది విద్యార్థులకు కనీసం 1కి పెంచండి.అన్ని %జజుఎ%ల పని స్థితిని తనిఖీ చేయండి మరియు అవసరమైె కెమెరాలను ఏర్పాటు చేయండి.సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతులు (%దీజ%), అలాగే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (నిర్దిష్ట వార్షిక ఆదాయ పరిమితి లోబడి) చెందిన విద్యార్థులు దీనికి అర్హులు. అనాథలు, %ఎ×ఎ% బాధిత పిల్లలు, మరియు దివ్యాంగుల పిల్లలు కూడా ఈ రిజర్వేషను అర్హులు. దురదృష్టవశాత్తు, తెలంగాణలో ఈ చట్టం అమలులో అనేక సవాళ్లు, ముఖ్యంగా జాప్యాలు ఎదురవుతున్నాయి. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఇప్పటికీ ప్రైవేట్ పాఠశాలల్లో ఈ రిజర్వేషన్ అమలు కావడం లేదు. 2024 అక్టోబర్ 19న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఈ నిబంధనను అమలు చేయడానికి ఒక మెమో జారీ చేసినప్పటికీ, అది ఏ తేదీ నుంచి అమలులోకి వస్తుందనే దానిపై స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్మెంట్లో జాప్యం జరుగుతుందని పాఠశాల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ ఆర్థిక భారం కారణంగా వారు ఈ పథకాన్ని అమలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఇది పేద విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందే హక్కున నిరాకరిస్తున్నట్లవుతోంది. ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ, సుమారు 90,000కు పైగా సీట్లు అందుబాటులో ఉన్నప్పటికీ, అవి పేద విద్యార్థులకు దక్కడం లేదు.ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఢిల్లీ, పంజాబ్ వంటి సుమారు 20 రాష్ట్రాలు ఈ నిబంధనను సమర్థవంతంగా అమలు చేస్తున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి కూడా తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు.కావున, గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారికి మరియు జిల్లా కలెక్టర్ గారికి ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున మా విన్నపం ఏమిటంటే:విద్యాహక్కు చట్టం 2009లోని 25% సీట్ల రిజర్వేషన్ ను తక్షణమే తెలంగాణలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేయడానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి.అమలు ప్రక్రియను పారదర్శకంగా, ఆన్లైన్ పోర్టల్ ద్వారా జరిగేలా చర్యలు తీసుకోవాలి.ప్రైవేట్ పాఠశాలలకు ఫీజు రీయింబర్స్మెంట్ను సకాలంలో అందించేందుకు తగిన నిధులు కేటాయించి, బకాయిలను వెంటనే చెల్లించాలి.

## కొమురవెల్లి మల్లన్న స్వామిని పట్టువస్త్రాల సమర్పణ



**సిద్దిపేట జిల్లా కొమరవెల్లి :** హరేంద్ర యాదవ్ జన్మదినం సందర్భంగా మల్యాల కుటుంబ సభ్యులు మధుసూదన్ యాదవ్, సునీతా, ధీరేంద్ర యాదవ్, హరేంద్ర యాదవ్, వీరేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.ఈ పవిత్ర కార్యక్రమం ఆలయ చరిత్రలో మొదటిసారి నిర్వహించబడినదిగా గర్వంగా తెలియజేస్తున్నాం. ఈ కార్యం జూన్ 13వ తేదీ నుండి ఆలయ ప్రాంగణంలోనే ప్రారంభమై, మగ్గం (చాపడం యంత్రం) స్వయంగా ఇక్కడ ఏర్పాటు చేసి పట్టువస్త్రాలు నేయడం జరిగింది.ఈ సందర్భంగా మల్యాల కుటుంబం తమ భక్తిని, సేవాభావాన్ని స్వామివారికి అర్పించారు. ఇది ఆలయ చరిత్రలో ఓ ముఖ్య ఘట్టంగా నిలిచిపోతుందని భావిస్తున్నాం అని ఆలయ పురోహితులు అన్నారు.

## రికవరీ కోసం డోర్ టు డోర్ క్యాంపెయిన్



**మడుగులపల్లి, తెలంగాణ సేన :** మాడ్గులపల్లి మండలంలోని అభంగాపురం వివోఏ లో స్త్రీ నిధి ఓవర్ డ్యూ రికవరీ కోసం డోర్ టు డోర్ తిరిగి సోమవారం రికవరీ చేశారు. 1162 రోజుల క్రానిక్ ఎస్ హెచ్ జి కనకదుర్గ ఎస్ హెచ్ నుంచి రికవరీ చేశారు .మిగిలిన సంఘాల సభ్యుల బుధవారం రికవరీ డ్రైవ్ లో చెల్లిస్తామని కమిట్మెంట్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్ ఎం స్త్రీ నిధి శ్రీలేఖ మాట్లాడుతూ ఓవర్ డ్యూ రికవరీ కొరకు జిల్లాలో ప్రతి బుధవారం శుక్రవారాలలో డిఆర్డీఏ ఆదేశానుసారం రికవరీ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఓవర్ డ్యూ అమౌంట్ ఉన్న ప్రతి సంఘం నుండి రికవరీ చెయ్యాలని తెలియజేశారు. సిబ్బంది,స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్ మరియు వివో ఏలు పాల్గొని రికవరీ చెయ్యాలని తెలియజేశారు .ఈయొక్క రికవరీ డ్రైవ్ లో ఆర్ యం స్త్రీ నిధి శ్రీలేఖ మాడుగుల పల్లి ఏటీఎం బాషపాక చంద్రశేఖర్, ఏపీఎం బిఎల్ రాము,సంబందిత సిసి సైదులు స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్ ఉమామహేశ్వరి వివో ఏ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి జూన్ 23 :** హుజురాబాద్ మున్సిపాలిటీ 13వ వార్డులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల గృహ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం సోమవారం జరిగింది. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి సందమల్ల బాబు, పట్టణ మహిళా అధ్యక్షురాలు వేముల పుష్పలత, యువజన కాంగ్రెస్ నాయకులు సందమల్ల నరేష్, పార్టీ సీనియర్ నేతలు మోరే తిరుపతి, కొండ్ర అజయ్, కొండ్ర కనకయ్య, వార్డు ఆఫీసర్ రాము తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు ఆవాసం కల్పించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకొస్తామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలతో పేదల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వారు హామీ ఇచ్చారు.

## రాష్ట్ర మంత్రులను కలిసిన గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు



**తెలంగాణ సేన న్యూస్,జూన్ 23 :** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఐ టి మినిస్టర్ శ్రీధర్ బాబు,దేవాదాయ శాఖమంత్రి కొండాసురేఖ ను సోమవారం మైనంపల్లి హన్మంతరావు తో కలిసి మర్యాద పూర్వకంగా కలిసిన గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు , ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రులతో చర్చించడం జరిగింది అని అన్నారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిటుకుల మహిపాల్ రెడ్డి,కావేరి వెంకట్ రెడ్డి జకాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం కు కృషి అభినందనీయం

**దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి, మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి**



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్,జూన్ 23 :** దాతలు సహృదయంతో అందించే సాయాన్ని , విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి కోరారు. సోమవారం భువనగిరి మండలం యర్రంబెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, హైదరాబాద్ వైశ్య భవన్ వారి సహకారంతో అందించిన నోట్ బుక్స్, బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు - మన బడి, బడిబాట కార్యక్రమంలో దాతలు , ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన అన్నారు. హైదరాబాద్ వైశ్య భవన్ ట్రస్ట్ సభ్యులు ఎస్ . రామేశ్వరం, బలరాం, కార్యదర్శి రవీంద్రనాథ్ గుప్తా, డిస్ట్రిక్ట్ అకాడమిక్ కో- ఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్ విద్యార్థులకు నోట్ బుక్స్,టై, బెల్ట్, బ్యాగులను, ప్లేట్ , గ్లాసులు విద్యార్థులకు అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో వంటగది నిర్మాణం కోసం దాత రిటైర్డ్ ప్రొఫెసర్ సోలిపురం మధుసూదన్ రెడ్డి, పాఠశాలకు సౌండ్ సిస్టం ను గ్రామానికి చెందిన గొర్ల వైకుంఠం లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హేమలత, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కలకొండ సరిత, ప్రధానోపాధ్యాయులు వి. శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు రాజు, వరలక్ష్మి,రజిత, అంగన్వాడీ టీచర్ శైలజ, ఆశావర్కర్ జ్యోతి, గ్రామ మాజీ సర్పంచ్ యశోద, గ్రామస్తులు, గొర్ల వైకుంఠం, మోహన్ రెడ్డి, నాళ్ళ చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా పేదలకు లబ్ధి - కాంగ్రెస్ యువనేత ప్రణవ్..



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిది జూన్ 23 :** సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా ఆపదలో ఉన్న పేదలకు లబ్ధి చేకూరుతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు, రెండు పట్టణాలకు సంబంధించిన 198 మంది లబ్ధిదారులకు 75,67,000/- లక్షల విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. చెక్కులు అందజేసిన వారిలో హుజూరాబాద్ మండలం-31, హుజురాబాద్ పట్టణం-18, జమ్మికుంట మండలం-22, జమ్మికుంట పట్టణం-13, వీణవంక-39, ఇల్లందకుంట- 21, కమలాపూర్- 54 మంది చొప్పున చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతిగా వ్యవహరిస్తూ ఆపద సమయంలో సీఎంఆర్ఎఫ్ తో అన్ని విధాల ఆదుకోవడం జరుగుతుందని ప్రణవ్ తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిది జూన్ 23 :** వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి పుల్లమ్మ -మోహన్ రెడ్డి 49,500 రూపాయలు,పోతరవేన వనిత-రవీందర్ 27,500 రూపాయలు, దాసరపు సోనా-కుమార్ 28,000 రూపాయలు, దాసరి మురళి -సత్యనారాయణ 15,000 రూపాయలు, సింగిరెడ్డి హారిక-కోమల్ రెడ్డి 19,000 రూపాయలు మొత్తం 139000 రూపాయలు ఒక్క నర్సింగాపూర్ గ్రామానికి ఈరోజు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ గారు %జవీ=ఖీ% చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు ఈ కార్యక్రమంలో వీణవంక యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పోతరవేన సతీష్ కుమార్, సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మెంతులను ఇలా వాడారంటే..100 ఏళ్లు మీ గుండె సేఫ్..! తప్పక తెలుసుకోండి..







మెంతులతో ఆరోగ్యానికి అనేక లాభాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అనేక వైద్య పరిశోధనలు సైతం మెంతులు శరీరానికి ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నాయి.. ముఖ్యంగా రాత్రి పూట నీళ్లల్లో నానబెట్టిన మెంతి నీరు ఉదయాన్నే తీసుకుంటే ఫలితాలు అధికంగా ఉంటాయట. అయితే, మెంతులను తినేందుకు ఇంతకంటే మెరుగైన, శక్తివంతమైన పద్ధతి మరొకటి ఉందని చెబుతున్నారు. అదేంటంటే.. మెంతులను నెయ్యిలో వేయించి పాలలో కలుపుకుని తీసుకోవడం వల్ల అమోఘమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయని చెబుతున్నారు. ఆ సీక్రెట్స్ ఏంటో తెలియాలంటే పూర్తి వివరాల్లోకి వెళ్లాల్సిందే..ఉదయాన్నే ఖాళీ కడుపుతో గ్లాసుడు మెంతి నీళ్లు తాగితే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలామంది ఇది ఫాలో అవుతున్నారు కూడా. పరగడుపునే ఈ నీటిని తీసుకోవటం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్ లో ఉంటాయి. బరువు తగ్గడానికి కూడా హెల్ప్ అవుతుంది. అయితే పోషకాహార నిపుణుల ప్రకారం.. అదే మెంతులను నెయ్యిలో వేయించి పాలలో కలుపుకుని తీసుకోవడం వల్ల ఊహించని లాభాలు ఉన్నాయని చెబుతున్నారు.

సాధారణంగా మెంతులు చేదుగా ఉంటాయి. కానీ వాటిని నెయ్యిలో దోరగా వేయించడం వల్ల ఆ చేదుదనం చాలా వరకు తగ్గిపోతుందట. పైగా వీటికి చక్కటి సువాసన వస్తుంది. ఇలా వేయించిన మెంతులకు మంచి రుచి పెరగడంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు రెట్టింపు అవుతాయని చెబుతున్నారు. మెంతులలో మంచి ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీనిని నెయ్యితో వేయించినప్పుడు నెయ్యిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. ఇది మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేయించిన మెంతులను పాలలో కలపడం వల్ల ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. మెంతులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. నెయ్యితో కలిపి తీసుకున్నప్పుడు ఈ గుణం మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. మెంతులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. నెయ్యితో కలిసినప్పుడు ఇవి రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ ను నియంత్రించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. వేయించిన మెంతులు పాలతో కలపడం వల్ల అదనపు ప్రయోజనాలు అందుతాయి. పాలు కడుపులో మంట, అసౌకర్యం వంటి సమస్యలను తగ్గించి ఉపశమనాన్ని కలిగిస్తాయి. మెంతులు పేగుల ఆరోగ్యానికి మేలు చేస్తే, పాలు కడుపుకు చల్లదనాన్నిస్తాయి. ఈ రెండింటి కలయిక జీర్ణవ్యవస్థకు ఒక వరం లాంటిది. ఈ మిశ్రమం శరీరంలో పోషకాల శోషణను మెరుగుపరుస్తుంది. ఇందుకోసం ఒక టీస్పూన్ మెంతులను కొద్దిగా నెయ్యిలో దోరగా వేయించి, వాటిని ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో కలుపుకుని రాత్రి పడుకునే ముందు లేదా ఉదయం తాగవచ్చు.

# రాత్రిపూట ఇలాంటి లక్షణాలు కనిపిస్తే బీ అలర్ట్ మీ కిడ్నీలు డేంజర్‌లో ఉన్నట్టే..!



రాత్రి నిద్ర లేస్తే.. విశ్రాంతి లేకపోవడం, నిద్రపోవడంలో ఇబ్బంది, తరచుగా మేల్కొవడం, నిద్ర నాణ్యత సరిగా లేకపోవడం వంటివి మూత్రపిండాల సంబంధిత సమస్యకు సంకేతం కావచ్చు అంటున్నారు వైద్యులు. నిద్రలో తరచుగా కండరాల నొప్పులు, ఆకస్మిక కుదుపులు అలసటను మాత్రమే సూచిస్తాయి. అవి కాల్షియం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను సూచిస్తాయి. ఇది మూత్రపిండాల వైఫల్యం వల్ల సంభవించవచ్చు. మన శరీరాన్ని శుభ్రంగా ఉంచడానికి పనిచేసే మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే.. దాని ఎఫెక్ట్ రాత్రిపూట స్పష్టంగా కనిపిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట మన శరీరంలో కనిపించే కొన్ని లక్షణాలు మన మూత్రపిండాలు ఆరోగ్యంగా లేవని చెప్పటానికి సంకేతాలు అంటున్నారు. అలాంటి లక్షణాల గురించి మనం తప్పక తెలుసుకోవాలి. ఎందుకంటే..ఒక్కోసారి మనం చేసే చిన్న నిర్లక్ష్యంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కిడ్నీలు సరిగ్గా పనిచేసినప్పుడే మనం ఆరోగ్యం ఉండేందుకు దోహదపడుతుంది. లేదంటే..ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటున్నారు నిపుణులు. మీ కిడ్నీ సమస్యల్లో ఉందని చెప్పే కొన్ని సంకేతాలను ఇక్కడ చూద్దాం..

మీరు ఉదయం లేదా అర్ధరాత్రి నిద్ర లేచినప్పుడు మీ కాళ్ళు వాపుగా ఉంటే జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారను. ఎందుకంటే..మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని అంటున్నారు. రాత్రిపూట మేల్కొని తరచుగా బాత్రూమ్‌కు వెళ్లాల్సి రావడం కూడా సాధారణ విషయం కాదని అంటున్నారు. రెండు నుండి మూడు గంటలకు లేస్తుంటే, మూత్రపిండాలు సామర్థ్యాన్ని కోల్పోతున్నాయని సంకేతం కావచ్చు అంటున్నారు. రాత్రి బాగా నిద్రపోయినా మీరు రోజంతా తల తిరుగుతున్నట్లు, నిరంతరం అలసిపోయినట్లు, నీరసంగా ఉన్నట్లు అనిపిస్తే మీ మూత్రపిండాలు మీ శరీరం నుండి టాక్సిన్స్ తొలగించలేకపోతున్నాయని అర్థం.

మూత్రపిండాలు తమ పనిని చేయడంలో విఫలమైనప్పుడు శరీరంలో ద్రవం పేరుకుపోతుంది. ఇది ఊపిరితిత్తులకు చేరుతుంది. నిద్రలో ఈ సమస్య గుర్తించదగినదిగా మారుతుంది. రాత్రి నిద్ర లేస్తే.. విశ్రాంతి లేకపోవడం, నిద్రపోవడంలో ఇబ్బంది, తరచుగా మేల్కొవడం, నిద్ర నాణ్యత సరిగా లేకపోవడం వంటివి మూత్రపిండాల సంబంధిత సమస్యకు సంకేతం కావచ్చు అంటున్నారు వైద్యులు. నిద్రలో తరచుగా కండరాల నొప్పులు, ఆకస్మిక కుదుపులు అలసటను మాత్రమే సూచిస్తాయి. అవి కాల్షియం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను సూచిస్తాయి. ఇది మూత్రపిండాల వైఫల్యం వల్ల సంభవించవచ్చు. ఆరోగ్య నిపుణులు, ఇతర అధ్యాయనాల ద్వారా అందిన సమాచారం మేరకు ఈ వివరాలు అందిస్తున్నాం.. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. ఏదైనా సందేహాలు,సమస్యలు ఉన్నా వైద్యులను సంప్రదించడమే మంచిదని గమనించగలరు.

# పైనాపిలే కదా అని తీసిపారేయకండి.. ప్రయోజనాలు తెలిస్తే షాకవుతారు!



ఫైనాపిల్ మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులోని విటమిన్ సి ముడుతలను తగ్గిస్తుంది. ఇది చర్మానికి హానిని కూడా నివారిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల ముఖంలో మెరుపు పెరుగుతుంది. పైనాపిల్ శరీరంలో మంటను తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. ఫైనాపిల్ పండు, జీర్ణక్రియకు సహాయం చేయడం నుండి రోగనిరోధక శక్తిని మెరుగుపరచడం వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అలాగే, ఈ పండులో విటమిన్ సి, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. పరిశోధనలన్నీ క్యాన్సర్‌తో పోరాడటానికి, మీ చర్మం మెరుపును పెంచడంలో ఇది ఉపయోగపడుతుందని వెల్లడిస్తున్నాయి. దాని మరిన్ని ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

## పైనాపిల్ ప్రయోజనాలు ఏమిటి?

విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా: పైనాపిల్ పండులో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరం రోజువారీ పనితీరుకు అవసరం. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ ఫుడ్ సైన్సెస్‌లో ప్రచురించబడిన పరిశోధన ప్రకారం, పైనాపిల్స్‌లో ఫైబర్, పొటాషియం, కాల్షియం కూడా తగిన మొత్తంలో ఉంటాయి. అందుకే దీన్ని తీసుకోవడం చాలా మంచిది. పైనాపిల్స్‌లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి: మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో యాంటీఆక్సిడెంట్లు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. కణాల నష్టంతో పోరాడుతుంది. అలాగే తీవ్రమైన వ్యాధుల నుండి రక్షిస్తుంది. అందుకే మీరు మీ ఆహారాన్ని మరింత ఆరోగ్యవంతంగా మార్చుకోవడానికి ఈ పండును తినవచ్చు. జీర్ణక్రియలో సహాయాలు: పైనాపిల్ పండు మరొక ప్రయోజనం ఏమిటంటే ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉంటుంది: పైనాపిల్ ఫైబర్ గొప్ప మూలం. ఇది మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధకం సమస్యతో బాధపడే వారికి పైనాపిల్ పండు మంచి ఔషధం.


క్యాన్సర్ నివారించవచ్చు: పైనాపిల్ తినడం వల్ల క్యాన్సర్ నివారించవచ్చు. ఎందుకంటే చాలా క్యాన్సర్లు ఆక్సీకరణ ఒత్తిడి వల్ల వస్తాయి. పైనాపిల్‌లో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించే గుణం ఉంది. తద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అందుకే క్యాన్సర్ చికిత్సకు కూడా దీన్ని ఉపయోగిస్తారని అధ్యయనం చెబుతోంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: పైనాపిల్ శరీరంలో మంటను తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నొప్పిని తగ్గించే లక్షణాలు: పైనాపిల్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నందున, ఇది నొప్పిని తగ్గిస్తుంది. ఫుడ్స్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ఆర్థరైటిస్ వల్ల కలిగే నొప్పికి చికిత్స చేయడానికి పైనాపిల్ మంచిదని పేర్కొంది. ఇది వెన్నునొప్పిని కూడా తగ్గిస్తుంది. ఇది ఋతు నొప్పిని కూడా తగ్గిస్తుంది. కానీ ఋతు చక్రం మొదటి మూడు రోజులలో తీసుకోవాలి. ఆరోగ్యకరమైన చర్మం మీ సొంతం అవుతుంది: పైనాపిల్ మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులోని విటమిన్ సి ముడుతలను తగ్గిస్తుంది. ఇది చర్మానికి హానిని కూడా నివారిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల ముఖంలో మెరుపు పెరుగుతుంది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించండి.

# ఉదయాన్నే జీలకర్ర నీరు తాగితే ఎలాంటి లాభాలు ఉంటాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు!



జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం.. జీలకర్ర ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది అందరి ఇళ్లలో ప్రతి వంటగదిలో అందుబాటులో ఉంటుంది. జీలకర్ర అనేది ప్రతి వంటల్లో ఉపయోగిస్తుంటారు. దీని వల్ల ఆహారం రుచిగా ఉండడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం. జీలకర్ర నీటిని ఖాళీ కడుపుతో తాగితే శరీరంలోని అనేక వ్యాధులు నయమవుతాయి. బలహీనమైన శరీరాన్ని బలోపేతం చేయడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీన్ని రోజూ తాగడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇందులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. జీలకర్రలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది మీ వ్యాధిని నయం చేయడంలో మీకు చాలా సహాయపడుతుంది. మీరు ప్రతిరోజూ ఉదయం తప్పనిసరిగా జీలకర్ర నీటిని తాగాలి. ఇది శరీరంలో వాపులను తగ్గించడానికి కూడా పనిచేస్తుంది. ఇది మాత్రమే కాదు, వివిధ వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో ఇది చాలా సహాయపడుతుంది. అలాగే శరీరంలోని మురికిని తొలగిస్తుంది. చాలా మందికి శ్వాస సంబంధిత సమస్యలు చాలా ఉన్నాయి. మీరు ఖాళీ కడుపుతో ప్రతిరోజూ జీలకర్ర నీటిని తాగితే, మీరు శ్వాస ఆరోగ్యానికి సంబంధించిన అనేక సమస్యల నుండి బయటపడవచ్చు. శ్వాసకోశంలో ఉపశమనం కలిగించవచ్చు. మీరు దాని నీటిని చాలా వేడిగా తాగాల్సిన అవసరం లేదు. మీరు దానిని గోరువెచ్చగా మాత్రమే తాగాలి. జీలకర్ర నీటిలో యాంటీఆక్సిడెంట్ పదార్థాలు ఉన్నాయి. ఇది మీ శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో మీకు సహాయపడుతుంది. ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత ఈ నీటిని తాగాలి.

# కామెర్లు వచ్చినప్పుడు కళ్ళు, గోర్లు ఎందుకు పసుపు రంగులోకి మారుతాయి? కారణం ఇదే



కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయలేనప్పుడు, రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరగడం ప్రారంభమవుతుంది. ఇది శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంటుంది. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలలో పసుపు రంగు వస్తుంది. దీనిని కామెర్లు అంటారు. ఈ వ్యాధిని రక్త పరీక్ష.. కామెర్లు ఒక సాధారణ ఆరోగ్య సమస్య. ఇది సోకినప్పుడు శరీరంలో పసుపు రంగు కనిపించడం ప్రారంభమవుతుంది. దీని ప్రభావం కళ్ళ నుండి గోళ్ళ వరకు కనిపిస్తుంది. వాటిని విస్మరించడం వల్ల కొన్నిసార్లు శరీరంలో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. కామెర్లు వచ్చిన తర్వాత కళ్ళు, గోళ్ళు ఎందుకు పసుపు రంగులోకి మారుతాయో తెలుసుకుందాం. ఈ లక్షణాలను చూసిన తర్వాత మనం ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలి?

### అందుకే పసుపు రంగు కనిపిస్తుంది

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బిలిరుబిన్ ఎర్ర రక్త కణాలలో కనిపిస్తుంది. శరీరంలో అప్పుడప్పుడు ఎర్ర రక్త కణాలు ఏర్పడి చనిపోతాయి. కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయడానికి పనిచేస్తుంది. కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయలేనప్పుడు, రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరగడం ప్రారంభమవుతుంది. ఇది శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంటుంది. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలలో పసుపు రంగు వస్తుంది. దీనిని కామెర్లు అంటారు. ఈ వ్యాధిని రక్త పరీక్ష ద్వారా గుర్తిస్తారు.

### ఈ లక్షణాలు కనిపిస్తాయి

కళ్ళు, గోర్లు, మూత్రం పసుపు రంగులోకి మారడం
చర్మం పసుపు రంగులో కనిపిస్తుంది
ఆకలి లేకపోవడం
వికారం
ఏమీ తినాలని అనిపించకపోవడం
కడుపు నొప్పి
అలసిపోయినట్లు అనిపిస్తుంది
బరువు తగ్గడం
ప్రారంభ దశలో వైరల్ జ్వరం సమస్య
చలిగా అనిపిస్తుంది
కడుపు నొప్పి
టారీ బ్లాక్ కలర్ స్టూల్స్
ఇలా మిమ్మల్ని మీరు రక్షించుకోండి:
కలుషితమైన ఆహారాన్ని నివారించండి
మద్యం సేవించవద్దు
మరిగించిన నీరు తాగాలి.
నూనె పదార్థాలను నివారించండి
కారంగా ఉండే ఆహారానికి దూరంగా ఉండండి
భోజనం చేసేటప్పుడు శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించండి.
మీకు ఏవైనా లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించండి
కామెర్లు కారణంగా వచ్చే సమస్యలు
హెపటైటిస్ ఎ, బి, సి, డి, ఇ వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల ఈ సమస్య రావచ్చు.
పారాసెటమాల్ వంటి కొన్ని మందుల అధిక మోతాదు వల్ల ఇది జరగవచ్చు.
విషపూరిత పుట్టగొడుగుల వంటి విష పదార్థాల వినియోగం వల్ల ఇది జరగవచ్చు.
ఈ పరిస్థితి గిల్బర్ట్ సిండ్రోమ్, డుబిన్-జాన్సన్ సిండ్రోమ్ మొదలైన పుట్టుకతో వచ్చే రుగ్మతల వల్ల తలెత్తవచ్చు.
పిత్త వాహిక లేదా పిత్తాశయ రాళ్ళు అడ్డుకోవడం వల్ల కూడా కామెర్లు వస్తాయి.
కాలేయ క్యాన్సర్

### ఇది కాలేయాన్ని దెబ్బతీస్తుందా?

కామెర్లు కాలేయాన్ని దెబ్బతీస్తాయి. ఈ వ్యాధికి కారణాన్ని తెలుసుకోవడం ముఖ్యం. కాలేయం సరిగ్గా పనిచేయలేనప్పుడు బిలిరుబిన్ శరీరం నుండి బయటకు రాదు. శరీరంలో దాని స్థాయి పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో కామెర్లతో పాటు ముదురు మూత్రం, తేలికపాటి మలం, అలసట, వికారం లేదా వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే, అది కాలేయం దెబ్బతిన్నట్లు సంకేతం కావచ్చు.

# పుస్తక సమీక్ష




ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సకాలంలో వర్షం పడితే రైతులకు సంబరం. ఏ కారణంతోనైనా వరుణుడు అలిగితే రైతుల కంట్లో కన్నీళ్ల ధారలే. వర్షచ్ఛాయ ప్రాంతం కావడంతో ఈ జిల్లాలో వాన కోసం కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూస్తుంటారు. గంగుల నరసింహారెడ్డి 'వాన కురిసింది' కథా నేపథ్యం ఈ వాతావరణమే. ఈ కథలో రైతు అనంతరెడ్డి తన పంటకు అదునైన వానకోసం ఎదురుచూస్తుంటాడు. ఇల్లేమో వానొస్తే కురిసే మట్టిమిద్దె. కూతురు, అల్లుడు తొలిరాత్రి సందర్భంలో వానజల్లు మొదలవుతుంది. ఓవైపు ఇల్లు కురుస్తుంటుంది. దీంతో ఆ కొత్తజంట వాన కురవడమే ముఖ్యమని తమ సమాగమాన్ని వాయిదా వేసుకుంటుంది. రైతు సంతోషమే ప్రధానమని చాటుతుందీ కథ. ఈ సంకలనంలోని మరో 13 కథలు.. దేనికవే ప్రత్యేకం. రాత్రివేళ ఎన్నో భయాల మధ్య సమాజంలో ఓ వివాహితకు భద్రత కలిగినా, ఇంట్లో భర్త అనుమానించిన వైనం 'కుళ్లిన సంఘం'లో కనిపిస్తుంది. పల్లెల్లో కులాధిపత్యం నీడన బడుగుల బాధలను 'ప్రశ్న' కళ్లకు కడుతుంది. బ్యాంకులిచ్చే చాలీచాలని రుణాలతో చిన్న రైతులకు ఎదురయ్యే విపత్కర పరిస్థితిని 'ఎ లోన్ స్టోరీ' వివరిస్తుంది. పిరికితనానికి, మంచితనానికి మధ్య తేడాను 'రాముడు మంచి బాలుడు' తేటతెల్లం చేస్తుంది. 'ఒడిబియ్యం' మనుషుల మధ్య అనుబంధాలే ముఖ్యమని చాటుతుంది. 'కొనుక్కోవాలి' కథ వృద్ధులైన తల్లిదండ్రులు పిల్లల ఆప్యాయతను ఎలా పొందాలో వెల్లడిస్తుంది. వృద్ధాశ్రమం నుంచి సొంతూరు వెళ్లిన మనిషి తన మిత్రులతో ఆనందంగా గడపడానికి ఏ నిర్ణయం తీసుకున్నాడో 'శిథిల సంధ్యలో చిరుదీపం' తెలుపుతుంది. గంగుల నరసింహారెడ్డి వివిధ సందర్భాల్లో రాసిన ఈ కథలు పాఠకుల్లో మంచిని పెంచేలా సాగుతాయి.

## ఈవీ స్కూటర్ ధరలు తగ్గించేలా హీరో సూపర్ ప్లాన్.. సరికొత్త కాన్సెప్ట్‌తో నయా ఈవీ విడుదల



ఇటీవల ఈవీ స్కూటర్ల జోరు దేశంలో బాగా పెరిగింది. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు ఈవీ స్కూటర్ల వాడకాన్ని ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని కంపెనీలు బడ్జెట్ ఫ్రెండ్లీ ఈవీ స్కూటర్లను లాంచ్ చేస్తున్నాయి. తాజాగా ఈవీ స్కూటర్ల ధరలు తగ్గించేలా హీరో కంపెనీ సూపర్ ప్లాన్ వేసింది. ఆ ప్లాన్‌కు అనుగుణంగా కొత్త ఈవీను కూడా మార్కెట్‌లో లాంచ్ చేయనుంది. హీరో మోటోకార్ప్ కంపెనీకు చెందిన విడా జూలై 1, 2025న తన తదుపరి ఎలక్ట్రిక్ స్కూటర్ విడా వీఎక్స్‌ను లాంచ్ చేయనున్నట్లు తెలిపింది. భారతీయులకు తక్కువ ధరకు ఈవీ అందించాలనే ఉద్దేశంతో కంపెనీ ఓ కొత్త ప్రణాళిక వేసింది. హీరో తీసుకొచ్చిన ఈ ప్రణాళికతో భవిష్యత్‌తో ఈవీ వాహన రంగంలో పెను సంచలనాలకు కారణం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అందరూ బ్యాటరీతో సహా ఈవీను కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈవీ స్కూటర్ ధర అమాంతం పెరుగుతుంది. అయితే ఈ సమస్యకు చెక్ పెట్టేలా సబ్‌స్క్రిప్షన్ బ్యాటరీ విధానంతో హీరో ఈవీ కొత్త ప్రణాళికను పరి చేసింది. వీఎక్స్2 ఈవీ బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ (బీఏఏఎస్) ప్లాన్‌తో లాంచ్ చేసింది. వినియోగదారులు స్కూటర్‌ను మాత్రమే కొనుగోలు చేసి దాని బ్యాటరీకు మాత్రం సబ్‌స్క్రిప్షన్‌ను చెల్లించాల్సి ఉంటుంది. హీరో తీసుకొచ్చిన ఈ కొత్త ప్రణాళికతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ముందస్తు ధరలు భారీగా తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ మోడల్ కింద, వినియోగదారులు సౌకర్యవంతమైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్స్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. బ్యాటరీ నిర్వహణతో పాటు భర్తీ విషయానికి వస్తే ఆ బాధ్యతలు సబ్‌స్క్రిప్షన్ విధానంలో ఉంటాయి కాబట్టి ధర భారీగా తగ్గుతుంది. హీరో విడా వీఎక్స్2 ఈవీ స్కూటర్ హై-ఎండ్ విడా వీ2 స్కూటర్‌కు బడ్జెట్- ఫ్రెండ్లీ ప్రత్యామ్నాయమని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నా. ఈ రెండు స్కూటర్లు కొంత అంతర్గత హార్డ్‌వేర్‌లు ఒకే మాదిరిగా ఉంటాయి. వీఎక్స్-2 సరళమైన మరింత ఆచరణాత్మక డిజైన్‌తో ఆకర్షిస్తుంది. డిస్క్ కు బదులుగా డ్రమ్ బ్రేక్లు, చిన్న టీఎఫ్‌టీ డిస్‌ప్లేతో పాటు సింగిల్ సీట్ సెటప్‌తో వస్తుంది. అందువల్ల ఈ స్కూటర్ బజాజ్ చేతక్ 3001, ఏథర్ 450ఎక్స్‌కు గట్టి పోటీనిస్తుంది.

## మొబైల్ రీఛార్జ్ ప్లాన్స్ 28 రోజులే ఎందుకు ఉంటాయి? బిజినెస్ మైండ్ అంటే ఇదే..



సాధారణంగా మొబైల్ రీఛార్జ్ చేసుకోవాలంటే 30 రోజుల వ్యాలిడిటీ కాకుండా 28 రోజులే ఉంటాయి. మరి నెల మొత్తం కాకుండా కేవలం 28 రోజులో ఎందుకు ఉంటాయోనని మీరెప్పుడైనా ఆలోచించారా? దీన్ని బట్టి చూస్తే కంపెనీ బిజినెస్ మైండ్ ఎలాంటి ఉంటుందో అర్థమైపోతుంటుంది.. భారతదేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రముఖ టెలికాం కంపెనీలు కస్టమర్లను ఆకర్షించడానికి వివిధ రకాల ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లను ప్రవేశపెడుతున్నాయి. చాలా కంపెనీల రీఛార్జ్ ప్లాన్‌లలో చాలా వరకు 28 రోజులకు సంబంధించినవి. కంపెనీలు నెల కూడా పూర్తి చేయకుండా 28 రోజుల ప్లాన్‌లను ప్రవేశపెట్టడం వెనుక ఒక పెద్ద వ్యాపార వ్యూహం ఉంది. ప్రారంభంలో కొన్ని కంపెనీలు మాత్రమే 28 రోజుల ప్లాన్‌లను ప్రవేశపెట్టాయి. కానీ ఇప్పుడు చాలా కంపెనీలు ఈ పద్ధతిని అనుసరిస్తున్నాయి. వారు ప్రతి నెలా ప్లాన్‌లను ప్రవేశపెడితే, వినియోగదారులు సంవత్సరంలో 12 సార్లు మాత్రమే రీఛార్జ్ చేసుకోవాలి. కానీ వాస్తవం ఏమిటంటే 28 రోజుల ప్లాన్‌లతో వినియోగదారులు సంవత్సరంలో 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాలి. 28 రోజుల ప్లాన్‌లను ఉపయోగించడం ద్వారా మీరు 30 రోజుల నెలల్లో 2 రోజులు తక్కువ, 31 రోజుల నెలల్లో 3 రోజులు తక్కువ పొందుతారు. దీని వలన దాదాపు ఒక నెల అదనంగా వస్తుంది. అందుకే సంవత్సరానికి 12 రీఛార్జ్‌లకు బదులుగా, మీరు 13 రీఛార్జ్‌లు చేయాలి. ఫిబ్రవరిలో 29 రోజులు ఉన్న సంవత్సరాల్లో ఆ విధంగా ఒక అదనపు రోజు కూడా అందుబాటులో ఉంటుంది. ఈ వ్యూహం ద్వారా టెలికాం కంపెనీలు ప్రతి సంవత్సరం ఒక అదనపు నెల రీఛార్జ్ ప్రయోజనాన్ని పొందుతాయి. అయితే ఇటీవల కోర్టు ఆదేశాలతో కొంత ఎక్కువ రీఛార్జ్ ప్లాన్‌తో 30 రోజుల పాటు వ్యాలిడిటీ కూడా అందిస్తున్నాయి.

## పాలసీదారుడు, నామినీ ఇద్దరు మరణిస్తే డబ్బు ఎవరికి అందిస్తారు? చట్టం ఏం చెబుతోంది?




కొన్ని కంపెనీలు క్లెయిమ్‌ల త్వరిత పరిష్కారం కోసం నిబంధనలు సడలిస్తున్నాయి, ఉదాహరణకు ఈ సందర్భాలలో కోర్టు నుండి ఆర్డర్ కోసం వేచి ఉండటానికి బదులుగా, క్లెయిమ్ సెటిల్‌మెంట్ నుండి వచ్చిన మొత్తాన్ని ఎలా విభజించాలో వారసులు అంగీకరిస్తే.. ఎప్పుడు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగుతుందో చెప్పని పరిస్థితి. ఈరోజుల్లో రకరకాల అనారోగ్య సమస్యలు, రోడ్డు ప్రమాదాలు ఇలా ఎన్నో రకాల ప్రమాదాల కారణంగా చాలా మంది మరణిస్తున్నారు. అందుకే ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ ఉండాలని సూచిస్తుంటారు నిపుణులు. కొన్నిసార్లు మనం ఎప్పుడూ ఊహించని పరిస్థితులు తలెత్తుతాయి. జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా ప్రమాద సంఘటనను తీసుకోండి. ఈ భయంకరమైన ప్రమాదం గురించి ఎవరికైనా కనీసం ఆలోచన ఉందా? ఇప్పుడు ఓ ప్రశ్న తలెత్తుతుంది. బీమా పాలసీలో పాలసీదారుడు, నామినీ ఇద్దరూ మరణిస్తే బీమా డబ్బులు ఎవరికి అందుతాయి?

### విమాన ప్రమాదం తర్వాత అనేక కేసులు తెరపైకి..

పీటీఐ నివేదిక ప్రకారం.. అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత, పాలసీదారుడు, క్లెయిమ్ పొందిన నామినీ ఇద్దరూ ప్రమాదంలో మరణించిన అనేక కేసులు వెలుగులోకి వచ్చాయి. అహ్మదాబాద్ నుండి లండన్ గేట్‌వేకి బయలుదేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం మెడికల్ ఆస్పత్రి భవనంపై కూలిపోయి 241 మంది ప్రయాణికులు మరణించిన విషయం తెలిసిందే. అలాగే మరణించారు. భవనంలో ఉన్న 35 మంది వరకు మేడికోలు, సిబ్బంది మరణించారు. ఇలాంటి పరిస్థితుల్లో దుఃఖాన్ని ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులు తరువాత ఏమి జరుగుతుందో, బీమాలో వచ్చిన డబ్బును ఎలా క్లెయిమ్ చేసుకోవాలో కూడా ఆలోచించాల్సి ఉంటుంది. పాలసీదారుడు, నామినీ ఇద్దరూ మరణిస్తే బీమా డబ్బు ఎవరికి వస్తుందో తెలుసుకుందాం.

### బీమా పాలసీ జప్తు అవుతుందా?

ముందుగా బీమా మొత్తం ఎప్పుడూ జప్తు కాదని, , కానీ పాలసీదారుడి ఆస్తిలో భాగమవుతుంది. సాధారణంగా పిల్లలు, జీవించి ఉన్న తల్లిదండ్రులు లేదా జీవిత భాగస్వామి వంటి చట్టపరమైన వారసులు దీనిని క్లెయిమ్ చేసుకోవచ్చు. ఎయిర్ ఇండియా ప్రమాదం తర్వాత అనేక బీమా కంపెనీలు ఇలాంటి కేసులను ఎదుర్కొంటున్నాయి. వంటి అనేక బీమా సంస్థలు పాలసీదారు, నామినీ ఇద్దరూ మరణించిన క్లెయిమ్‌లను అందుకున్నాయి. నివేదిక ప్రకారం.. కొన్ని కంపెనీలు క్లెయిమ్‌ల త్వరిత పరిష్కారం కోసం నిబంధనలు సడలిస్తున్నాయి, ఉదాహరణకు %జూ×జ% ఈ సందర్భాలలో కోర్టు నుండి ఆర్డర్ కోసం వేచి ఉండటానికి బదులుగా, క్లెయిమ్ సెటిల్‌మెంట్ నుండి వచ్చిన మొత్తాన్ని ఎలా విభజించాలో వారసులు అంగీకరిస్తే, చట్టపరమైన వారసుల నుండి డిక్లరేషన్, నష్టపరిహార బాండ్లను అంగీకరిస్తున్నట్లు తెలిపింది. సాధారణంగా బీమా కంపెనీలు పత్రాలను తనిఖీ చేసి, పాలసీదారుడు లేదా నామినీతో క్లెయిమ్ చేసే వ్యక్తి సంబంధాన్ని నిర్ధారించిన తర్వాత డబ్బును చెల్లిస్తాయి. ఇప్పుడు రెండవ ప్రశ్న ఏమిటంటే.. ఎక్కువ మంది చట్టపరమైన వారసులు ఉంటే ఈ పరిస్థితిలో కంపెనీ ఏం చేస్తుంది? హిందూ వారసత్వ చట్టంలో చట్టపరమైన వారసులను రెండు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గంలో కొడుకు-కుమార్తె, భార్య, తల్లి వంటి క్లాస్ వన్ చట్టపరమైన వారసులు ఉన్నారు. క్లాస్ వన్ చట్టపరమైన వారసులలో ఎవరూ లేకుంటే క్లాస్ 2 పరిగణిస్తారు. ఇందులో తండ్రి, సోదరుడు-సోదరి, మేనల్లుడు-మేనకోడలు ఉన్నారు.

## పసిడి ప్రియులకు అలర్ట్.. తెలుగు రాష్ట్రాల్లో తులం బంగారం ధర ఎంత ఉందో తెలుసా..?



బంగారానికి మళ్లీ రెక్కలు వచ్చేశాయి. ఇరాన్ ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పెట్టుబడులకు సేఫ్ అయిన బంగారం వైపు ఇన్వెస్టర్లు చూస్తున్నారు. దీంతో బంగారం, వెండి ధరలు ఆల్‌టైమ్ గరిష్టంలో ట్రేడ్ అవుతున్నాయి. అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లపై ఒత్తిడి, ముడిచమురు ధరలు పెరగడం వంటి అంశాలు పసిడి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అటు వెండి ధరలు కూడా గరిష్ట స్థాయిల్లోనే స్థిరంగా కొనసాగుతున్నాయి. వాస్తవానికి పసిడి, వెండికి ఎల్లప్పుడూ డిమాండే ఉంటుంది.. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కోసారి తగ్గితే.. మరికొన్ని సార్లు పెరుగుతూ వస్తుంటాయి.. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి.. జూన్ 22 2025 ఆదివారం ఉదయం వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర 1,00,750 ఉండగా.. 22 క్యారెట్ల ధర 92,350 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,10,000లుగా ఉంది.

### ప్రముఖ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,00,750 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.92,350 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,20,000లుగా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,00,750 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.92,350లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,20,000 లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,00,900, 22 క్యారెట్ల ధర రూ.92,500 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,10,000లుగా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.1,00,750, 22 క్యారెట్ల ధర రూ.92,350 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,10,000లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,00,750 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.92,350 లుగా ఉంది. వెండి ధర కిలో రూ.1,20,000 లుగా ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,00,750, 22 క్యారెట్ల ధర రూ.92,350 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,10,000 లుగా ఉంది.

గమనిక, ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవిగా గమనించగలరు.. ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు. పసిడి ప్రియులకు అలర్ట్.. తెలుగు రాష్ట్రాల్లో తులం బంగారం ధర ఎంత ఉందో తెలుసా..?

## క్రెడిట్ స్కోరు 750 దాటినా.. మీరు బ్యాంకు నుంచి రుణం పొందలేరు.. ఎందుకో తెలుసా?












ఇప్పటికే రుణం తీసుకుంటే కొత్త రుణం తీసుకోవడం కష్టమవుతుంది. బహుళ రుణాలు ఒకేసారి నడుస్తుంటే, కొత్త రుణం తీసుకోవడం చాలా కష్టం. ఎందుకంటే ఈ పరిస్థితిలో ఆ వ్యక్తికి రుణం తిరిగి చెల్లించే సామర్థ్యం ఉందా లేదా అని.. కొత్త లోన్ తీసుకునేటప్పుడు లేదా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు క్రెడిట్ స్కోర్ చాలా ముఖ్యం. అలాగే క్రెడిట్ స్కోర్ 750 కంటే ఎక్కువ ఉంటే, తక్కువ వడ్డీ రేటుకు రుణం పొందడం సులభం అని నిపుణులు అంటున్నారు. కానీ చాలా మంది క్రెడిట్ స్కోర్ 750 కంటే ఎక్కువ ఉండవచ్చు. కానీ వారు లోన్ తీసుకోవడానికి వెళ్ళినప్పుడు బ్యాంక్ దానిని తిరస్కరిస్తుంది. ఎందుకో తెలుసా..?

కానీ ఇలా ఎందుకు జరుగుతుంది? దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. కస్టమర్ చాలా త్వరగా ఉద్యోగాలు మారుతున్నట్లు బ్యాంక్ గమనించి ఉండవచ్చు. అలాంటప్పుడు బ్యాంకు రుణం ఇవ్వడానికి నిరాకరించవచ్చు. ఎందుకంటే అలాంటి పరిస్థితిలో, ఆ వ్యక్తి ఆదాయం స్థిరంగా లేదని బ్యాంక్ భావిస్తుంది. ఫలితంగా ఆ వ్యక్తికి రుణం ఇవ్వడం చాలా ప్రమాదకర పని. అంటే వ్యక్తికి ఉద్యోగం స్థిరంగా లేదని, చీటికి మాటికి మారుతుంటాడని గమనిస్తుంది బ్యాంకు. దీని వల్ల ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి రుణం ఇచ్చేందుకు వెనుకడుగు వేస్తుంది.




ఇప్పటికే రుణం తీసుకుంటే కొత్త రుణం తీసుకోవడం కష్టమవుతుంది. బహుళ రుణాలు ఒకేసారి నడుస్తుంటే, కొత్త రుణం తీసుకోవడం చాలా కష్టం. ఎందుకంటే ఈ పరిస్థితిలో ఆ వ్యక్తికి రుణం తిరిగి చెల్లించే సామర్థ్యం ఉందా లేదా అని బ్యాంకు పరిశీలిస్తుంది. ఆ వ్యక్తికి రుణం తిరిగి చెల్లించే సామర్థ్యం లేదని బ్యాంకు భావిస్తే, ఆ వ్యక్తికి మరో రుణం లభించదు.

చాలా రుణాలకు హామీదారుడు అవసరం. హామీదారుడి క్రెడిట్ స్కోరు చెడ్డది అయినప్పటికీ కస్టమర్ తరచుగా రుణం పొందలేరు. ఫలితంగా, మీరు భవిష్యత్తులో రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటే మీరు మీ క్రెడిట్ స్కోరుతో పాటు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

ఇలాంటి తప్పులు చేసినట్లయితే మీకు క్రెడిట్ స్కోర్ భారీగా ఉన్నప్పటికీ బ్యాంకు నుంచి రుణం పొందలేరని గుర్తించుకోండి. మీరు రుణం పొందాలంటే క్రెడిట్ స్కోర్‌తో పాటు ఇతర వివరాలు బ్యాంకులు పరిశీలిస్తాయని గుర్తించుకోండి.

## జూలై 1 నుంచి ఈ వాహనాలకు పెట్రోల్, డీజిల్ బంద్.. కొత్త టెక్నాలజీ!




డేటాను పర్యవేక్షించడానికి ఎక్కువగా ఫ్లాగ్ చేయబడిన వాహనాలతో ఇంధన స్టేషన్లను గుర్తించడానికి కఠినమైన నిర్ణయాల అమలుకు ఢిల్లీ రవాణా శాఖ 100 ప్రత్యేక బృందాలను నియమించింది. ఢిల్లీ, పోల్యూషన్‌ను శుభ్రం చేయడానికి పాత బీఎస్ ప్రమాణాల వాహనాలను తొలగించడం.. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా గుర్తించి అన్ని వాహనాల లైఫ్ టైమ్ అయిపోయిన వాహనాలను జూలై 1 నుండి ఢిల్లీలోని పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపడానికి అనుమతించబోమని కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ప్రకటించింది.


10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాల జీవిత కాలం అయిపోయిన వాహనంగా పరిగణిస్తారు. %జూయువీ% ప్రకారం, ఈ నిషేధం నవంబర్ 1 నుండి గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్, సోనిపట్‌లకు విస్తరించనున్నారు. అలాగే ఏప్రిల్ 1, 2026 నుండి మిగిలిన ప్రాంతాలను కవర్ చేస్తుంది.

**3.63 కోట్లకు పైగా వాహనాలను తనిఖీ:** ఢిల్లీలోని 500 ఇంధన కేంద్రాలలో కెమెరాలను ఏర్పాటు చేశామని, దీనివల్ల వాహన డేటా రియల్ టైమ్ ట్రాకింగ్ సాధ్యమవుతుందని సభ్యుడు డాక్టర్ వీరేంద్ర శర్మ అన్నారు. ఇప్పటివరకు ఈ వ్యవస్థ 3.63 కోట్లకు పైగా వాహనాలను తనిఖీ చేసిందని, వాటిలో 4.90 లక్షల వాహనాలను లైఫ్ టైమ్ నిలిచిపోయినట్లు గుర్తించామని చెప్పారు. 29.52 లక్షల వాహనాలు తమ కాలుష్య నియంత్రణ ధృవీకరణ పత్రాన్ని పునరుద్ధరించాయని, ఫలితంగా రూ.168 కోట్ల విలువైన చలాన్లు జారీ చేసినట్లు శర్మ చెప్పారు.


**100 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు:** డేటాను పర్యవేక్షించడానికి ఎక్కువగా ఫ్లాగ్ చేయబడిన వాహనాలతో ఇంధన స్టేషన్లను గుర్తించడానికి కఠినమైన నిర్ణయాల అమలుకు ఢిల్లీ రవాణా శాఖ 100 ప్రత్యేక బృందాలను నియమించింది. ఢిల్లీ, పోల్యూషన్‌ను శుభ్రం చేయడానికి పాత బీఎస్ ప్రమాణాల వాహనాలను తొలగించడం చాలా ముఖ్యం అని శర్మ అన్నారు. వాయు కాలుష్యంలో ఈ వాహనాలు పెద్ద పాత్ర పోషిస్తాయి. ఇప్పుడు పారదర్శకమైన, డిజిటల్, జవాబుదారీ వ్యవస్థ అమలు చేసినందున ఈ వ్యవస్థను మరింత ప్రభావవంతంగా చేయడానికి టోల్ కేంద్రాలలో కూడా దీనిని ఉపయోగిస్తారు. దీని కోసం సుమారు 100 అమలు బృందాలు పని చేస్తాయి. వాహనాలు ఇంధన స్టేషన్ల వద్దకు చేరుకున్నప్పుడు వ్యవస్థ స్వయంచాలకంగా లైసెన్స్ ప్లేట్ నంబర్‌లను స్కాన్ చేస్తాయి.

ఇది వాహన డేటాబేస్‌తో డేటాను క్రాస్-రిఫరెన్స్ చేస్తుంది. ఇది రిజిస్ట్రేషన్ వివరాలు, ఇంధన రకం, వాహనం వయస్సు వంటి సమాచారాన్ని సేకరిస్తుంది. ఒక వాహనం చట్టపరమైన కాలపరిమితికంటే ఎక్కువగా ఉన్నట్లు తేలితే, దానిని ఎండ్ ఆఫ్ లైఫ్‌గా గుర్తిస్తారు. ఫ్లాగ్ చేసిన తర్వాత పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ వేయొద్దని హెచ్చరిక ద్వారా అలర్ట్ చేస్తుంది. దీంతో అలాంటి వాహనాలకు పెట్రోల్ గానీ,డీజిల్ గానీ వేయరు. ఉల్లంఘనను రికార్డ్ చేసి అమలు సంస్థలకు పంపుతుంది. వారు వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం లేదా స్క్రాప్ చేయడం వంటి తదుపరి చర్యలు తీసుకోవచ్చు.

## టీవీలో తండేల్ మూవీ ప్రీమియర్ షో.. రాజు ఎప్పుడొస్తున్నాడంటే..!



నాగ్ చైతన్య కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన చిత్రం తండేల్. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి కలయి కలో వచ్చిన 'తండేల్'చిత్రాన్ని చందూ మొండేటి తెరకెక్కిం చగా, ఈ మూవీకి వచ్చిన ఆదరణ అంతా ఇంతా కాదు. ఈ చిత్రం రూ.106 కోట్లకు పైగా ప్రపంచ వ్యాప్తంగా గ్రాస్ వసూల్ చేసిందని తండేల్ నిర్మాతలు ప్రకటించారు. రూ.70 కోట్లతో ఈ చిత్రాన్ని బన్నీ వాసు నిర్మించారు. గీతా ఆర్ట్స్ అధినేత, టాలీవుడ్ అగ్ర నిర్మాత అల్లు అరవింద్ సమర్పించిన సంగతి తెలిసిందే. లవ్, యాక్షన్, దేశభక్తి మిళితమైన ఈ చిత్రం ఆడియెన్స్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ ను సొంతం చేసుకుంది. థియేటర్ల వద్ద 'తండేల్' మూవీ కలెక్షన్ల ప్రభంజనం సృష్టించగా, అటు ఓటీటీలోనూ మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఈ చిత్రం ఇప్పుడు బుల్లితెర ప్రేక్షకులను కూడా అలరించడానికి సిద్ధంగా ఉంది. జూన్ 29న, 2025న సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో టెలివిజన్ ప్రీమియర్ కి రెడీ అయింది. ఈ మేరకు సదరు సంస్థ అధికారికంగా ప్రకటిస్తూ తమ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.ఈ క్రమంలో చైతన్య, సాయి పల్లవి జంట రెండు తెలుగు రాష్ట్రాల టీవీ ఛానళ్లలో సందడి చేయనున్నారు. ఆదివారం రోజు ఈ జంట ప్రేక్షకులకి మంచి వినోదం పంచనున్నారు. తండేల్ సినిమాలో మ్యూజిక్‌తో పాటు చైతన్య, సాయి పల్లవి నటనకు కూడా విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. మొత్తమ్మీద ఈ డీసెంట్ ఎమోషనల్ లవ్ డ్రామా, బలమైన ఎమోషన్స్ అండ్ ఫీల్ గుడ్ సీన్స్ తో సాగుతూ బాగా ఆకట్టుకుంది. డీసెంట్ టేకింగ్ సినిమా స్థాయిని పెంచాయి. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి స్వరాలు అందించారు. సంగీతం కూడా ఎంతగానో ఆకట్టుకుంది. తండేల్ సక్సెస్ తో ఫుల్ జోష్ లో ఉన్న చైతన్య తన తర్వాతి సినిమాను కార్తీక్ దండు దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. చైతూ కెరీర్లో 24(%చీజ%24)వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ మూవీ థ్రిల్లర్ గా తెరకెక్కుతోంది. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు వృష కర్మ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారు.





## ప్రేమలు బ్యూటీకి బర్త్‌డే విషెస్ తెలిపిన 'డ్యూడ్' టీమ్

ప్రేమలు సినిమాతో స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది మల్లు బ్యూటీ మమితా బైజు. ఈ భామ ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఆమె ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం డ్యూడ్ ఈ సినిమాకు కీర్తిశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. 'లవ్ టుడే' 'డ్రాగన్' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. నేడు మమితా బైజు బర్త్‌డే కావడంతో ఆమెకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. కొత్త పోస్టర్‌ని పంచుకుంది. ఈ సినిమాలో మమితా కురల్ అనే పాత్రలో నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

## తెలుగమ్మాయిలకు 20 శాతమే.. ఇంత కష్టం ఎక్కడా లేదు



టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలకు అవకాశాలు చాలా తక్కువ అనే కంప్లైంట్ ఎప్పటి నుంచో ఉంది. ఇది ఇప్పటికీ కొనసాగుతుందని చెబుతోంది యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలకు 20 శాతం మాత్రమే అవకాశాలు వస్తాయని..దాని కోసమే పదేళ్లు కొట్టుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిల పరిస్థితి ఎలా ఉంటుందో వివరించింది. 'తెలుగు అమ్మాయిలను చూస్తే గర్వంగా అనిపిస్తుంది. ఇండియాలో ఏ లాంగ్వేజ్ అమ్మాయికి అయినా ఇంత కష్టం ఉండదేమో. తెలుగులో మన వాళ్లకు 20 శాతం మాత్రమే అవకాశం ఉంటుంది. వందలో 80 సినిమాలకు పరభాష హీరోయిన్లనే తీసుకుంటారు. అదే మలయాళం, తమిళ్ తో పాటు ఇతర భాషల్లో చూస్తే..అక్కడ లోకల్ అమ్మాయిలకే 80 శాతం అవకాశం ఇస్తారు. ఇలా ఎక్కడ చూసిన తెలుగు అమ్మాయిలకు 20 శాతం మాత్రమే చాన్స్ ఉంటుంది. ఇందులోనే తమ టాలెంట్‌ని నిరూపించుకోవాలి. చిన్నప్పటి నంచి సినిమాలు చూసి ఇష్టం పెంచుకొని, పెరెంట్స్ ఒప్పించి ఇండస్ట్రీలోకి వస్తే.. ఈ 20 శాతం కోసమే పదేళ్లు కొట్టుకోవాలి. మిగతావాళ్లకి లోకల్‌తో పాటు మన దగ్గర కూడా 80 శాతం అవకాశాలు ఉంటాయి. అందుకే నాకు తెలుగు అమ్మాయిలను చూస్తే గర్వంగా ఉంటుంది. వాళ్లు మానసికంగా చాలా స్ట్రాంగ్‌గా ఉంటారు' అని అనన్య చెప్పుకొచ్చింది. ఇక ఇదే ఇంటర్వ్యూలో పొట్టేల్ సినిమాకు గాను తనకు వచ్చిన స్పెషల్ జ్యూరీ గద్దర్ అవార్డు గురించి మాట్లాడుతూ.. ఇలాంటి అవార్డు తనకు వస్తుందని అసలు ఊహించలేదని చెప్పింది. 'అవార్డులు ప్రకటించిన రోజు నా మూడ్ బాగోలేదు. ఇంట్లో పడుకొని ఉన్నాను. లేవగానే.. పాజిటివ్ విషయం గురించి థింక్ చేస్తూ.. ఏదైనా అవార్డు వస్తే బాగుండు అనుకున్నాను. అయితే ఆ రోజు గద్దర్ అవార్డులు ప్రకటిస్తారనే విషయం కూడా నాకు తెలియదు. బెడ్ రూం నుంచి హాల్‌లోకి రాగానే.. టీవీలో గద్దర్ అవార్డుల ప్రకటన న్యూస్ చూస్తూ.. 'ఇంత మంచి సినిమాలు చేస్తున్నా..నాక్కూడా వస్తే బాగుండు' కదా అని అన్నయ్యతో చెబుతున్నా..అంతలోనే నాకు పొట్టేల్ మూవీ నిర్మాత ఫోన్ చేసి'మన సినిమాకు అవార్డు వచ్చింది' అని చెప్పగానే షాక్ అయ్యాను. ఆరేళ్ల కెరీర్‌లో మీడియాతో పాటు ఇండస్ట్రీలో చాలా మంది సపోర్ట్ చేశారు. అందుకే నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను' అని అనన్య చెప్పుకొచ్చింది



## విజయ్ దేవరకొండపై అట్రాసిటీ కేసు!

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండపై కేసు నమోదు అయింది. ఏప్రిల్ 26న జరిగిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో గిరిజనులను అవమానించలేలా మాట్లాడారంటూ విజయ్‌పై గిరిజన సంఘం నాయకుడు అశోఖ్ కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద విజయ్ దేవరకొండపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హీరో వ్యాఖ్యలపై విచారణ జరిపుతున్నట్లు వారు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో తమిళ హీరో సూర్య హీరోగా నటించిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ ఈవెంట్‌కి విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా వెళ్లాడు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి గురించి మాట్లాడుతూ.. ఇండియా పాకిస్తాన్‌పై దాడి చేయాల్సిన అవసరం లేదు.. అక్కడి ప్రజలకే విరక్తి వచ్చి పాక్ ప్రభుత్వంపై తిరగబడతారు. 500 ఏళ్ల క్రితం ట్రైబల్స్ కొట్టుకున్నట్లు.. బుద్ధి లేకుండా, కనీస కామన్ సెన్స్ లేకుండా ఇలాంటి పనులు చేస్తున్నారు. మనమంతా ఐకమత్యంగా ఉండాలి' అని విజయ్ అన్నారు. ఈ వ్యాఖ్యలు గిరిజనులను ఉగ్రవాదులతో పోల్చాయని, వారిని అవమానించాయని గిరిజన సంఘం నాయకుడు అశోక్‌కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేడయంతో విజయ్‌పై కేసు నమోదు చేశారు. ఈ వివాదంపై విజయ్ అప్పుడే స్పందించాడు. తాను ట్రైబ్స్ అనే పదం వాడిన మాట నిజమే కానీ.. దాని అర్థం గిరిజనులు కాదని చెప్పారు. 'వందల ఏళ్ల కిందట సమాజం, ప్రజలు గుంపులుగా వ్యవస్థీకృతమై ఉండేవాళ్లని నా ఉద్దేశం. అలాంటి సమయంలో రెండు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవి. ఆ సెన్స్‌లోనే ట్రైబ్స్ అనే పదం వాడాను. అంతేకానీ, ఇప్పుడున్న షెడ్యూల్ ట్రైబ్‌ని ఉద్దేశించి నేను వ్యాఖ్యలు చేయలేదు. అయినా కూడా నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకొని హర్ట్ అయితే విచారం వ్యక్తం చేస్తున్నాను' అని విజయ్ అప్పుడే సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చాడు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332